

కొండా సురేఖకు సోనియా గాంధీ ప్రశంసలు

- కాళేశ్వరాలయంలో 42ఏళ్లకు కుంభాభిషేక నిర్వహణపై హర్షం
- సోనియాకు త్రివేణి సంగమం నీరు, ప్రసాదాలు పంపిన మంత్రి

వరంగల్, మార్చి 5(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర దేవాదాయ, అటవీశాఖ మంత్రి కొండా సురేఖను అభినందిస్తూ కాంగ్రెస్ చైర్‌పర్సన్ సోనియాగాంధీ బుధవారం ఓ లేఖ విడుదల చేశారు. తెలంగాణలోని చారిత్రత్మక ఆలయం కాళేశ్వరంలోని మహకుంభాభిషేకం నిర్వహించటం అభినందనీయమన్నారు. 42ఏళ్ల తరువాత ప్రత్యేక చొరవతీసుకుని దేవాదాయశాఖ మంత్రిగా సురేఖ కుంభాభిషేకం నిర్వహించటం అభినందనీయమన్నారు. తనకు గంగాజలంతో పాటు ప్రసాదాన్ని పంపించారని సోనియాగాంధీ ఆ లేఖలో పేర్కొన్నారు. కాగా, ఫిబ్రవరి 8, 9, 10 తేదీల్లో మూడు రోజుల పాటు భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో శ్రీకాళేశ్వర, ముక్తీశ్వరాలయంలో దేవాదాయశాఖ ఆధ్వర్యంలో మహకుంభాభిషేకం నిర్వహించారు. మంత్రి కొండా సురేఖతో పాటు మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. 42ఏళ్ల తరువాత నిర్వహించిన ఈ మహకుంభాభిషేకానికి వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. గోదావరి, ప్రాణహిత త్రివేణి సంగమంలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. ఈ మహాకుంభాభిషేకం సందర్భంగా ఏఐసీసీ అగ్రనాయకురాలు సోనియాగాంధీకి మంత్రి కొండా సురేఖ గంగాజలంతో పాటు ప్రసాదాలు పంపించారు. వాటిని స్వీకరించిన సోనియాగాంధీ మంత్రి సురేఖను అభినందిస్తూ లేఖ రాయటం చర్చనీయాంశంగా మారింది.

బ్రాండ్ల పేరిట దందా



స్వాధీనం చేసుకున్న నకిలీ మందులు, నిందితులతో సీపీ, పోలీసులు

- మార్కెట్‌లో నకిలీ పురుగుల మందులు
- కారులో రవాణా చేస్తూ పట్టుబడ్డ నిందితుడు
- అతడి సమాచారంతో మరో నలుగురి పట్టివేత
- రూ.32 లక్షల నకిలీ పురుగుల మందు డబ్బాలు, లేబుళ్లు స్వాధీనం

వరంగల్ క్రైం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ కంపెనీల లేబుల్స్ వినియోగించి నకిలీ పురుగు మందులను విక్రయిస్తున్న ముఠా సభ్యుల గుట్టును వరంగల్ కమిషనరేట్ పోలీసులు రట్టు చేసినట్లు సీపీ అంబర్ కిషోర్ ఝూ వెల్లడించారు. ఆయన వివరాల ప్రకారం.. మట్టెవాడ, టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా రెండు రోజుల కిందట వరంగల్ గోపాలస్వామి గుడి ప్రాంతంలో వాహనాలు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఓ కారులో ఉన్న పురుగు మందుల డబ్బాలను గుర్తించి అందులో ఉన్న మహరాష్ట్రలోని బల్లారి జిల్లా కురుగోడు ప్రాంతానికి చెందిన కాట్రగౌడ భాస్కర్‌రెడ్డిని అదుపులోకి తీసుకొని విచారించగా నకిలీ పురుగుల మందులు విక్రయిస్తున్నట్లుగా అంగీకరించాడు. కేసు నమోదు చేసిన మట్టెవాడ పోలీసులు.. భాస్కర్‌రెడ్డి ఇచ్చిన సమాచారంతో హైదరాబాద్‌లోని చర్లపల్లిలో ఉన్న గోదాముపై దాడిచేసి బెయర్, టాటా, కోర్టెవాతో పాటు మరో నాలుగు కంపెనీల లేబుల్స్‌తో ఉన్న రూ.32 లక్షల విలువ చేసే నకిలీ పురుగుమందులు, గడ్డి మందులను, రెండు కార్లను స్వాధీనం చేసుకున్నారు. అలాగే హైదరాబాద్ కుషాయిగూడకు చెందిన పిల్ల నాగ వెంకటరంగారావు, లకిడీకపూల్‌కు చెందిన ముద్దంగుల ఆదిత్య, హైదరాబాద్‌కు చెందిన పిట్ల నవీన్, మిర్యాలగూడకు చెందిన దూదిమెట్ల శ్రీధర్‌లను అదుపులోకి తీసుకొని విచారించారు. పురుగుల మందులకు కావాల్సిన ముడిసరుకులను కొనుగోలు చేసి డిమాండ్ ఉన్న కంపెనీ పేర్లతో మార్కెట్‌లో విక్రయిస్తున్నట్లు ఒప్పుకున్నారు.

ముగ్గురూ.. మనోళ్లేనా?



నిన్నటి వరకు ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీల ఎన్నికలు రాజకీయాలను హీటెక్కించాయి. ఇక ఇప్పుడు ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీ సీట్ల కేటాయింపు ఉత్కంఠను రేపుతున్నాయి. మొత్తం ఐదు ఎమ్మెల్సీ స్థానాలకు నోటిఫికేషన్ విడుదలవగా.. శాసనసభలో ప్రస్తుత బలాబలాల దృష్ట్యా మిత్రపక్షాలతో కలిపి అధికార కాంగ్రెస్‌కు నాలుగు, ప్రతిపక్ష బీఆర్‌ఎస్‌కు ఒక స్థానం దక్కనున్నాయి. ఇక ఆ సీట్లను దక్కించుకునేందుకు ఆయా పార్టీల్లోని నేతలు తీవ్రంగా పోటీ పడుతున్న నేపథ్యంలో ఏ పార్టీ నుంచి ఏ నాయకుడు పెద్దల సభలో అడుగుపెడతారోనన్నది సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఈ క్రమంలో కాంగ్రెస్‌తో పాటు ఆ పార్టీ మిత్రపక్షమైన సీపీఐ, ప్రతిపక్ష బీఆర్‌ఎస్ ఉమ్మడి ఓరుగల్లుకు ప్రాధాన్యమివ్వబోతున్నాయని, ఆయా పార్టీలకు చెందిన ముగ్గురు నేతలకు అవకాశం రాబోతోందన్న ప్రచారం జరుగుతోంది. కాంగ్రెస్ నుంచి పలువురు నేతలు పోటీపడుతుండగా సీఎం రేవంత్ వేం నరేందర్‌రెడ్డివైపు మొగ్గుచూపుతున్నారని, సీపీఐ నుంచి ఆ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి టి.శ్రీనివాస్‌రావు, బీఆర్‌ఎస్ నుంచి మాజీమంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతిరాథోడ్ పేర్లు పరిశీలనలో ఉన్నట్టు తెలుస్తోంది. ఏదేమైనా.. పలు సమీకరణల నేపథ్యంలో 'మనోళ్లు ముగ్గురు' పెద్దల సభలో అడుగుపెట్టబోతున్నారంటూ చర్చ జరుగుతోంది.

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీలో ఓరుగల్లుకే పార్టీల ప్రాధాన్యం!

- వరంగల్ నేతలకు ఇచ్చేందుకు కాంగ్రెస్, బీఆర్‌ఎస్ కసరత్తు
- పొత్తులో భాగంగా వచ్చే సీటును ఉమ్మడి జిల్లా వాసికి కేటాయించే యోచనలో సీపీఐ
- గత లోక్‌సభ ఎన్నికల్లోనే వరంగల్ ఎంపీ అభ్యర్థిత్వం కోసం ఆ పార్టీ ప్రయత్నం
- వేం వైపే సీఎం మొగ్గు
- గతంలో చేజారిన అవకాశాన్ని.. ఇప్పుడు ఇవ్వాలన్న భావనలో రేవంత్
- గులాబీలో డైలమా.. ఇద్దరు నేతల్లో ఒకరికి చాన్స్
- ఉత్కంఠగా మారిన ఎమ్మెల్సీ టికెట్ల కేటాయింపు

ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీ సీటు.. రాజకీయాల్లో హీటును పెంచుతోంది. ఏ పార్టీ ఎవరికి అవకాశమిస్తుందోనన్న ఉత్కంఠను రేపుతోంది. అయితే కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లతో పాటు తాజాగా కాంగ్రెస్‌తో పొత్తులో భాగంగా సీపీఐకి లభించే ఒక్క ఎమ్మెల్సీ సీటు కూడా ఓరుగల్లు నేతకే దక్కుతుందని.. తద్వారా మూడు పార్టీల నుంచి ముగ్గురు ఓరుగల్లు నేతలకు మండలిలో కాలుబెట్టే అవకాశం రాబోతందన్న ప్రచారం పొలిటికల్ సర్కిల్‌లో చక్కర్లు కొడుతోంది. గత పార్లమెంట్ ఎన్నికల్లో పొత్తులో భాగంగా వరంగల్ ఎంపీ సీటును సీపీఐ పట్టుపట్టింది. అయితే అప్పుడున్న రాజకీయ పరిస్థితుల్లో ఎంపీ టికెట్ వరంగల్ సీపీఐకి చేజారింది. ప్రస్తుతం పొత్తులో భాగంగా కేటాయిస్తున్న ఎమ్మెల్సీ సీటును వరంగల్ నేతలకే ఇవ్వాలనే ఒత్తిడి అధిష్ఠానంపై ఉండటం చర్చనీయాంశంగా మారింది. మరోవైపు కాంగ్రెస్ ఎమ్మెల్సీ సీటుపై అరడజను మంది ఓరుగల్లు నేతలు ఆశలు పెట్టుకున్నప్పటికి సీఎం రేవంత్‌రెడ్డి వేం వైపే మొగ్గుచూపుతున్నారనే చర్చ జరుగుతోంది. ఇక టీడీపీలో ఉన్నప్పుడు వేం నరేందర్‌రెడ్డి చేజారిన ఎమ్మెల్సీ సీటు ఈ సారి దక్కుతుందా అనే చర్చ కాంగ్రెస్‌లో జోరుగా సాగుతోంది. ఇక ప్రతిపక్ష బీఆర్‌ఎస్‌కు ఒక ఎమ్మెల్సీ సీటు రానుండగా.. ఉమ్మడి జిల్లా కు చెందిన ఒక ముఖ్యనేతకు దక్కనుందని ప్రచారం జరుగుతుండగా.. దీనిపై ఆ పార్టీలో డైలమా నడుస్తోంది.

ఎమ్మెల్సీ సీటుపై సీపీఐ నజర్..

ఎమ్మెల్యే కోటాలో ఐదు ఎమ్మెల్సీ స్థానాలకు నోటిఫికేషన్ విడుదలైంది. అయితే శాసనసభలో బలాబలాల దృష్ట్యా మిత్రపక్షాలతో కలిపి అధికార కాంగ్రెస్ పార్టీకి నాలుగు ఎమ్మెల్సీ సీట్లు దక్కే అవకాశం ఉంది. అయితే ఇందులో ఒక సీటు సీపీఐకి ఇవ్వాలని ఆ పార్టీ డిమాండ్ చేస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో రెండు ఎమ్మెల్సీ సీట్లు ఇస్తామని హామీ ఇచ్చారని, ఈసారి ఒక సీటు పక్కగా ఇవ్వాలని ఆ పార్టీ జాతీయ కార్యదర్శి కే.నారాయణ ఇటీవల వరంగల్ పర్యటనలో డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధిష్ఠానం కూడా ఒక సీటుకు సుముఖంగా ఉండటంతో వరంగల్‌కే ఆ ఒక్క సీటు ఇవ్వాలనే డిమాండ్ వినిపిస్తుంది. గత పార్లమెంట్ ఎన్నికల్లో పొత్తులో భాగంగా వరంగల్ ఎంపీ సీటు కోసం సీపీఐ తీవ్రంగా ప్రయత్నాలు చేసింది. సీపీఐ బలోపేతానికి విశేషంగా కృషి చేసిన బీఆర్.భగవాన్‌దాస్ కుమారుడు బీఆర్.లెనిన్‌కు ఎంపీ టికెట్ ఇవ్వాలని కాంగ్రెస్ అధిష్ఠానంపై సీపీఐ నేతలు ఒత్తిడి తెచ్చారు. అయితే అప్పుడున్న రాజకీయ సమీకరణాల

మిగతా 7వ పేజీలో..

కోటంచ జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

కలెక్టర్ రాహుల్ శర్మ



కలెక్టర్ రాహుల్ శర్మకు స్వాగతం పలుకుతున్న అర్చకులు

రేగొండ, మార్చి 5(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోటంచ లక్ష్మీ నరసింహ స్వామి జాతరకు పకడ్బందీగా ఏర్పాటు చేయాలని కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. మండలంలోని కోటంచ లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని ఆయన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 9 నుంచి 16 వరకు జరగనున్న కోటంచ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు భక్తులకు అసౌకర్యం లేకుండా చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని సూచించారు. భక్తులకు తాగునీటికి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని అన్నారు. ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్‌కు స్థలం, సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. జాతరలో పారిశుధ్య నిర్వహణ ఎంతో కీలకమని అన్నారు. తాత్కాలిక మరుగుదొడ్లు, మెడికల్ క్యాంపులు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీఎస్పీ బోనాల కిషన్, జిల్లా వైద్యాధికారి మధుసూదన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నిర్మల, విద్యుత్ డీఈ పాపిరెడ్డి, ఈవో మహేష్ తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా నిర్మూలనే ధ్యేయంగా..

నెల పాటు ఎక్సైజ్ శాఖ స్పెషల్ డ్రైవ్

771 కేసుల్లో 823 మంది అరెస్టు.. 137 వాహనాలు సీజ్



వరంగల్ క్రైం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాను గుడుంబా రహిత జిల్లాగా మార్చే లక్ష్యంతో ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళుతున్నట్లు ఎక్సైజ్ ఉమ్మడి వరంగల్ జిల్లా డిప్యూటీ కమిషనర్ జి.అంజన్‌రావు తెలిపారు. ఉమ్మడి వరంగల్‌లో గుడుంబా ప్రభావిత ప్రాంతాలైన మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, వరంగల్ జిల్లాల్లో రాష్ట్ర ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలహసన్‌రెడ్డి ఆదేశాల మేరకు జనవరి 15 నుంచి ఫిబ్రవరి 15 వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించామన్నారు.

ఈ డ్రైవ్‌లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 771 కేసులు నమోదు చేసి 823 మంది అరెస్టు చేశామన్నారు. గుడుంబా తరలిస్తున్న 137 వాహనాలను సీజ్ చేసి, 746 మందిని బైండోవర్ చేశామన్నారు. నేరాలు చేస్తూ పట్టుబడ్డ 45 మందిని బ్రీచ్ కేసు కిం ద అరెస్టు చేసి నిందితులతో ప్రభుత్వానికి రూ.8లక్షల 75వేలను చేశామన్నారు. మారుమూల ప్రాంతాల్లోని పల్లెలు, తండాల్లో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నామని, నాటుసారా, బెల్లం విక్రయించడం, సరఫరా చేస్తూ పట్టుబడితే కఠినమైన చర్యలుంటాయని అంజన్‌రావు హెచ్చరించారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం





భూపాలపల్లి పట్టణంలోని తేజస్విని కళాశాల కేంద్రంలో పరీక్ష రాసేందుకు వచ్చిన విద్యార్థులు, దివ్యాంగురాలైన విద్యార్థినిని తీసుకొస్తున్న బంధువు

భూపాలపల్లి జిల్లాలో తొలిరోజు 94 శాతం హాజరు

ములుగు జిల్లాలో 1,911 మంది

భూపాలపల్లిటౌన్/ములుగు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్షలు భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో బుధవారం ప్రశాంతంగా జరిగాయి. కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య విద్యార్థులు పరీక్ష రాశారు. భూపాలపల్లి జిల్లాలో తొలి రోజు 1,901 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 1,802 మంది పరీక్ష రాశారు. మొత్తంగా 99 మంది గైర్హాజరయ్యారు. జీరో మాల్ ప్రాక్టీస్‌తో పరీక్షలు సజావుగా జరిగాయి. మండలాల వారీగా వివరాలు ఇలా వున్నాయి. తాడిచర్ల (మల్హర్) మండలంలో 128 మంది విద్యార్థులకు 14 మంది గైర్హాజరయ్యారు. ఇందులో జనరల్ విద్యార్థులు 87 మంది, వొకేషనల్ విద్యార్థులు 27 మంది ఉన్నారు. అలాగే మహదేవపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 159 మందికి ఆరుగురు గైర్హాజరయ్యారు. ఇక్కడ జనరల్ విద్యార్థులు 114, వొకేషనల్ వారు 39 మంది ఉన్నారు. కాటారం ప్రభుత్వ కళాశాలలో 190 మంది విద్యార్థులకు 20 మంది గైర్హాజరయ్యారు. భూపాలపల్లి జూనియర్ కళాశాలలో 337 మందికి గాను 22 మంది గైర్హాజరయ్యారు. చిట్యాలలో 310 మందికి 8మంది గైర్హాజరయ్యారు. కాటారం మండలం గంగారం గ్రామంలోని టీజీఎంఎస్ పరీక్ష కేంద్రంలో 194 మందికి 10 గైర్హాజరయ్యారు. చిట్యాల టీజీఎంఎస్‌లో 341కి 8 మంది గైర్హాజరయ్యారు. తేజస్విని జూనియర్ కళాశాలలో 242 మందికి 11 మంది గైర్హాజరయ్యారు. మొత్తంగా జనరల్ విద్యార్థులు 1533 మందికి 1465 మంది హాజరయ్యారు. వొకేషనల్ విద్యార్థులు 368 మందికి 337 మంది హాజరయ్యారు. మొత్తంగా 2998 మందికి గాను 99 మంది గైర్హాజరయ్యారు. 94శాతం మంది హాజరు కాగా 5.20 శాతం గైర్హాజరయ్యారని ఇంటర్మీడియట్ నోడల్ కోఆర్డినేటర్ వెంకన్న తెలిపారు.

ములుగు జిల్లాలో112 మంది గైర్హాజరు

ఇంటర్మీడియెట్ పరీక్షలు జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. తొలిరోజు తెలుగు పరీక్ష విజయవంతంగా పూర్తయ్యింది. మొత్తం 2,023 మంది విద్యార్థులకు పది పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. 1,911 మంది విద్యార్థులు మొదటి పరీక్షకు హాజరుకాగా 112మంది గైర్హాజయ్యారు. ఉదయం 8గంటల నుంచే కేంద్రాల వద్ద విద్యార్థుల సందడి నెలకొంది. 9 గంటలకు పరీక్ష ప్రారంభం కాగా అరగంట ముందుగానే విద్యార్థులను పరీక్ష కేంద్రాలలోకి అనుమతించారు. పరీక్షల నిర్వహణ అధికారులు ప్రతి విద్యార్థినీ క్షుణ్ణంగా తనిఖీ చేశారు. రవాణా సమస్యలు ఎదురుకాకుండా ప్రత్యేక బస్సుల సర్వీసులను నడిపించారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడమేకాకుండా 144 సెక్షన్ విధించారు. ములుగులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ దివాకర తనిఖీ చేశారు. మాస్ కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా పరీక్షలను పారదర్శకంగా జరిపించాలని అధికారులను ఆదేశించారు. ఎలక్ట్రానిక్ పరికరాలు వాడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్ష పూర్తయిన వెంటనే జవాబు పత్రాలను పోలీసు బందోబస్తు నడుమ నిర్దేశిత కేంద్రాలకు తరలించి భద్రపర్చాలని సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా ఇంటర్ విద్యాధికారి చంద్రకళ ఉన్నారు.



ములుగులో పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ దివాకర



వాజేడులో రూం నంబర్లు చూసుకుంటున్న విద్యార్థినులు

సింగరేణికి బకాయిలను వెంటనే చెల్లించాలి

బీఎంఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అప్పాని శ్రీనివాస్



కార్మికులతో మాట్లాడుతున్న అప్పాని శ్రీనివాస్

భూపాలపల్లి కృష్ణకాలనీ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థకు రావాల్సిన బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని బీఎంఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అప్పాని శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కేటీకే 5 ఇన్‌క్లైన్‌లో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2024 డిసెంబరు నాటికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన ట్రాన్స్‌కో, జెన్‌కో సంస్థలు సింగరేణికి రూ.35,645 కోట్ల బకాయిలు ఉందన్నారు. ఇవి చెల్లించకపోవడం వల్ల సింగరేణి ఆర్థికంగా తీవ్రంగా దెబ్బతిని సంస్థ మనుగడకే ముప్పు ఏర్పడుతోందన్నారు. గత బీఆర్ఎస్ హయాంలో రూ.25వేల కోట్ల బకాయిలు ఉండగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కనీసం బొగ్గు కొనగోలు చేసిన డబ్బులు కూడా సింగరేణికి ఇవ్వడం లేదని ఆరోపించారు. నాడు బీఆర్ఎస్, నేడు కాంగ్రెస్ ప్రభుత్వాలు సింగరేణిని ఏటీఎంగా మార్చుకున్నాయని మండిపడ్డారు. సంస్థ అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో బీఎంఎస్ నాయకులు సుజేందర్, రేణికుంట్ల మల్లేష్, రాజు, రమేష్, కొత్తూరి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

గోదావరిలో కోళ్ల కళేబరాలు

- బర్డ్‌ఫ్లూతో చనిపోయినవి అంటూ ప్రచారం



మండలంలోని ముల్లకట్ట బ్రిడ్జి వద్ద గోదావరిలో తేలిన చనిపోయిన కోళ్లు

ఏటూరునాగారం రూరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని గోదావరిలో బ్రాయిలర్ కోళ్ల కళేబరాలు బుధవారం దర్శనమిచ్చాయి. భక్తులు స్నానాలు ఆచరించే ప్రదేశంలో ముల్లకట్ట బ్రిడ్జి వద్ద వందల సంఖ్యలో చనిపోయిన కోళ్లు నీటిపై తేలిన దృశ్యాలు స్థానికులను ఆందోళనకు గురిచేశాయి. వ్యాపారులు వైరస్ సోకి చనిపోయిన కోళ్లను గుట్టుచప్పుడు కాకుండా గోదావరిలో పడేసినట్లు ప్రచారం జరుగుతోంది. స్థానిక వ్యాపారులు బ్రాయిలర్ కోళ్లను ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణలోని పలు జిల్లాల నుంచి దిగుమతి చేస్తుంటారు. బర్డ్‌ఫ్లూ కారణంగా రెండు రాష్ట్రాల్లోని పలు జిల్లాల్లో కోళ్లు చనిపోతున్నాయనే ప్రచారం జోరుగా సాగుతున్న క్రమంలో ఈ ఘటన చోటుచేసుకోవడంతో స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని గుర్తు తెలియని వ్యాపారులు కోళ్లను దిగుమతి చేసుకోగా అవి వైరస్ కారణంగా మృత్యువాత పడటంతో గుట్టుచప్పుడు కాకుండా ఐదు రోజుల క్రితం దగ్గరలోని గోదావరిలో పడేసినట్లు సమాచారం. పవిత్ర గోదావరి నదిలో చనిపోయిన కోళ్లను వేయడం సరికాదని పలువురు విమర్శిస్తున్నారు. భక్తులు ఇక్కడ పుణ్య స్నానాలు ఆచరిస్తుంటారని, ఇలాంటి ప్రాంతంలో చనిపోయిన కోళ్లను పడేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. అదేవిధంగా వైరస్‌తో మృత్యువాత పడ్డ కోళ్లను చేపలు తినడం కూడా మంచిది కాదని పలువురు అంటున్నారు.

సమానత్వంతోనే సమాజ పురోగతి

- మహిళా క్రీడల ప్రారంభ కార్యక్రమంలో కలెక్టర్ దివాకర



చెస్ పోటీలను పరిశీలిస్తున్న కలెక్టర్ దివాకర

ములుగు కలెక్టరేట్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): సమాజం పురోగతి సాధించాలంటే స్త్రీ, పురుషుల మధ్య సమానత్వం అవసరమని ములుగు కలెక్టర్ టి.ఎస్.దివాకర అన్నారు. ఈనెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలోని వివిధ శాఖల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులకు జిల్లా కేంద్రంలోని గిరిజన భవన్‌లో నిర్వహిస్తున్న క్రీడలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళా ఉద్యోగులకు 16 రకాల క్రీడలు నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. క్రీడల్లో ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొని విజేతలుగా నిలవాలన్నారు. రెండు రోజులపాటు జరిగే క్రీడలను సంబంధిత అధికారులు సమన్వయంతో పూర్తిచేయాలని సూచించారు. క్రీడలు శారీరక దృఢత్వాన్ని పెంచడమే కాకుండా మానసిక దృఢత్వాన్ని, ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని అన్నారు. దీని ద్వారా వివిధ శాఖల మధ్య, ఉద్యోగుల మధ్య మంచి సఖ్యత, సమన్వయం ఏర్పడతాయని అన్నారు. అంతేకాకుండా క్రీడా స్ఫూర్తితో మహిళలందరూ వారి శాఖల్లో, ఉద్యోగం, వృత్తుల్లో ఉత్తమ ప్రతిభను కనబరిచి ప్రజలకు, పేదవారికి అందించాల్సిన సేవలను ఉత్తమ రీతిలో అందించాలన్నారు. కాగా, మొదటి రోజు షటిల్, స్కిప్పింగ్, చెస్, క్యారమ్, లెమన్‌స్పూన్, గన్నీబ్యాగ్స్, మ్యూజికల్ ఛైర్, బెలూన్స్ క్రీడలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి కె.శిరీష, టీజీవో అసోసియేషన్ జిల్లా సెక్రటరీ కందుల జీవన్‌కుమార్, ట్రెజరర్ ప్రకాశ్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ బి.లక్ష్మణ్‌నాయక్, జాయింట్ సెక్రటరీ శైలజ, యశ్వంత్, రఫిక్, టీజీవో బాధ్యులు, మహిళా ఉద్యోగులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

గుండెల్లో గోదారి గుబులు

- ఏటూరునాగారం, మంగపేట నదీ తీరంలో రక్షణ గోడ నిర్మాణంలో జాప్యం
- రూ.114.17కోట్లతో మూడేళ్ల క్రితమే అగ్రిమెంటు
- డిజైన్‌లో మార్పులు
- జియోట్యూబ్ టెక్నాలజీతో ఆర్నెల్ల క్రితం సర్కారుకు నివేదిక
- ఎట్టకేలకు లభించిన ఆమోదం
- రూ.250కోట్లకు పెరగనున్న అంచనా వ్యయం

ములుగు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : బీడు భూములను సస్యశ్యామలం చేసే జీవధార గోదావరి నది ములుగు జిల్లా తీరప్రాంత ప్రజలను ఏటా భయభ్రాంతులకు గురిచేస్తోంది. ఉధృతంగా ప్రవహిస్తూ ఎప్పుడు ఉప్పెనలా మారుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. వరదను అదుపు చేస్తూ ఊళ్లను కాపాడేందుకు పాలకుల చర్యలు ఆశించినంతగా కనిపించడం లేదు. గత ప్రభుత్వంలోనే నిధులు మంజూరై టెండర్లు పూర్తయినా డిజైన్‌లో మార్పులు చేర్పులతో ప్రస్తుత సర్కారు జాప్యం చేసింది. ఎట్టకేల కు రీడిజైన్‌కు అనుమతిచ్చినప్పటికీ అంచనా వ్యయం రెండింతలు పెరిగింది.



ఏటూరునాగారం సమీపంలో ముంపునకు గురైన డబుల్‌బెడ్‌రూం ఇళ్లు (ఫైల్)

ములుగుజిల్లాలోని కన్నాయిగూడెం, ఏటూరునాగారం, వాజేడు, మంగపేట మీదుగా 90 కిలోమీటర్ల పొడవునా గోదావరి నది ప్రవహిస్తోంది. కన్నాయిగూడెం మండలంలో దేవాదుల ఎత్తిపోతల పథకం, తుపాలకులగూడెం వద్ద బహుళార్థక సమ్మక్క బ్యారేజీ ఉన్నాయి. ఏటా వర్షాకాలంలో గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఏటూరునాగారం, మంగపేట మండలాల్లోని రామన్నగూడెం, అకినేపల్లి మల్లారం, రాంనగర్, కత్తిగూడెం, చుంచుపల్లితోపాటు కన్నాయిగూడెం, వాజేడు మండలాల పరిధిలోని తీరం కోతకు గురవుతోంది. ప్రతీ వర్షాకాలంలో ఉగ్రరూ పందాల్చే గోదావరి ఏటా వందల ఎకరాల భూములను తనలో కలుపుకుంటోంది. దీంతో తీరగ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. 1948 సెప్టెంబరులో వరదలకు ఏటూరునాగారం ప్రాంతం ముంపునకు గురైంది. తర్వాత 1986 ఆగస్టులో మరోసారి విరుచుకుపడింది. 1991, 2020 సంవత్సరాల్లో కూడా తీర గ్రామాలను భయపెట్టినా పెద్దగా నష్టం జరగలేదు. కానీ, 2022లో 10రోజులపాటు ఎడతెరిపిలేకుండా కురిసిన వానలకు తోడు ఎగువ ప్రాంతాల నుంచి వరద పోటెత్తడంతో ఏటూరునాగారం, మంగపేట, వాజేడు మండలాల్లోని లోతట్టు గ్రామాలు మునిగిపోయాయి. గోదావరి చరిత్రలోనే అత్యధికంగా 29 లక్షల క్యూసెక్కుల వరద ముంచెత్తడంతో తీరప్రాంత పల్లెలు చిగురుటాకులా వణికిపోయాయి. 2023, 2024లో కూడా నది ఉధృతంగా ప్రవహించడంతో ముంపునకు గురైన లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. ఎస్‌డీఆర్ఎఫ్, డీడీఆర్ఎఫ్ బృందాలను మోహరించిన అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. మంగపేట మండల కేంద్రంలోని పొదుమూరుకాలనీకి సమీపంలోని పుష్కరఘాట్ వద్ద గోదావరి ఒడ్డు భారీగా కోతకు గురవుతోంది. ఇక్కడ 2015లో జరిగిన పుష్కరాల సందర్భంగా నిర్మించిన స్నానఘట్టాలు, ఇతర నిర్మాణాలు కొట్టుకుపోయాయి. సుమారు కిలోమీటర్ల వరకు నది గ్రామం వైపుకు చొచ్చుకు వచ్చింది. తీరంవెంట రైతులు సాగుచేసుకుంటున్న పంటభూములు నదిలో కలిసిపోయాయి.

2007లో కరకట్టకు పునాది

ఏటూరునాగారం మండలం రాంనగర్-మంగపేట మధ్య రూ.46.44 కోట్ల వ్యయంతో 2007లో రివిట్‌మెంట్, లాంచింగ్ ఆప్రాన్‌లతో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం కరకట్టను నిర్మించింది. ఎస్‌ఈడబ్ల్యూ కన్‌స్ట్రక్షన్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో 68 శాతం పనులు జరిగాయి. భూసేకరణ సమస్య ఎదురవ్వడంతో 2009 సెప్టెంబర్‌లో సదరు కంపెనీ కరకట్ట పనులను నిలిపివేసింది. గోదావరి వరదకు ఈకట్ట అడ్డుగా నిలబడటంతో తీర గ్రామాలకు కొంత ఊరట కలిగింది. మిగిలిన పనుల కోసం 2017లో సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ సీఈ, క్యూసీ సీఈల బృందం క్షేత్రపరిశీలన జరిపి సమగ్ర నివేదికను ప్రభుత్వానికి అప్పగించింది. అయితే పాత కాంట్రాక్టు కంపెనీతో చేసుకున్న అగ్రిమెంట్‌ను రద్దుచేసే విషయంలో దాటవేత ధోరణిని కొనసాగించింది. 2022లో రూ.137.23 కోట్లు మంజూరు చేస్తూ పరిపాలనా అనుమతులు జారీ అయ్యాయి. 3.99 శాతం అధికానికి హర్ష కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్, హెచ్‌ఈఎస్ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలు ఉమ్మడిగా టెండర్లు దక్కించుకున్నాయి. రూ.114.17కోట్లకు అగ్రిమెంటు కూడా పూర్తయ్యింది. ఇదే సంవత్సరం జూలైలో భారీ వరదలు ముంచెత్తగా అప్పటి సీఎం కేసీఆర్ రోడ్డుమార్గంలో ఏటూరునాగారం రావడం, ముంపు ప్రాంతాలను సందర్శించి ఐటీడీఏలో అధికారులతో సమీక్ష జరపడంతో పనులు చకచకా జరుగుతాయని సర్వత్రా భావించారు. కానీ, మూడేళ్లుగా ఒక్క అడుగు కూడా పడలేదు. మంగపేట, ఏటూరునాగారం మండలాల్లో కలిపి 27.891 కిలోమీటర్ల పొడవునా కరకట్టను నిర్మించాల్సి ఉంది. ఏడాది క్రితం పనులు ప్రారంభించి కట్ట దెబ్బతిన్న పలుచోట్ల ఇసుక బస్తాలను వేశారు. రూ.10 కోట్ల మేర బిల్లుల చెల్లింపు జరిగింది. రీడిజైన్ ప్రతిపాదన తెరపైకి రావడంతో పనులు నిలిచిపోయాయి.





మంగపేట పుష్కర ఘాట్ వద్ద ఒడ్డును కోతకు గురిచేస్తూ ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి నది (ఫైల్)

రీ డిజైన్‌కు ఆమోదం.. జియోట్యూబ్ టెక్నాలజీ అమలు

ఎంతటి వరదనైనా తట్టుకునే పటిష్టమైన కట్ట నిర్మాణం కోసం నూతన సాంకేతికను జోడిస్తూ ఆరు నెలల క్రితం అధికారులు సమర్పించిన రీడిజైన్‌కు తాజాగా అమోదం లభించింది. సుదీర్ఘ పరిశీలన తర్వాత మార్చి 3న సెంట్రల్ డిజైన్‌ఆర్గనైజేషన్ సీఈ మోహన్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఏటా వరద ఉధృతి పెరుగుతుండగా 50 ఏండ్ల సీడబ్ల్యూసీ రికార్డులను పరిగణనలోకి తీసుకొని పటిష్టమైన కట్టను నిర్మించాలని పేర్కొన్నారు. ఏటూరునాగారం, కమలాపురం, మంగపేట వద్ద నాలుగు చోట్ల రాళ్లతో నిండిన గుట్టలను ఏర్పాటు చేయాలని, గతంలో ప్రతిపాదించిన నదీ గర్భంలో ఐదు మీటర్ల రాతి తెట్టను 30మీటర్ల లోతుకు పెంచి నిర్మించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రాతి, సీసీ కట్టతోపాటు వరద పోటు ఎక్కువగా ఉన్న పలు ప్రాంతాలలో జియోట్యూబ్‌ను నిర్మించాలని నిర్ణయించారు. ఈశాన్య రాష్ట్రాలలో బ్రహ్మపుత్ర నది పరివాహకంలో తరుచూ ముంచెత్తే వరదల నియంత్రణకు ఈ తరహా టెక్నాలజీ ఉపయోగించగా మంచి ఫలితాలు వచ్చాయి. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బ్యారేజీకి ఎగువన ఈ జియోట్యూబ్‌ల ఏర్పాటుకు అప్పట్లో ఇంజనీర్లు ప్రతిపాదించారు. వంద మీటర్ల చొప్పున పలుచోట్ల జియో ట్యూబ్‌లను ఏర్పాటు చేయనున్నారు.

రూ.250 కోట్లకు పెరిగిన వ్యయం

మారిన డిజైన్ ప్రకారం పనులు చేయాలంటే వ్యయం రెండింతలు కానుంది. గడిచిన మూడేళ్లలో రేట్లు కూడా అధికం కావడంతో రూ.250 కోట్ల వరకు అవసరమవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈమేరకు పనులు చేస్తేనే కట్ట కలకాలం ఉండి తీర గ్రామాలకు ముప్పు తొలగనుంది.

పనులు వెంటనే ప్రారంభింపజేస్తాం
ధనసరి అనసూయ సీతక్క, రాష్ట్ర మంత్రి

గోదావరి తీర గ్రామాలను కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. రీ డిజైన్‌కు అమోదం లభించడంతో వెంటనే పనులు మొదలుపెట్టేలా చర్యలు తీసుకుంటున్నారు. పెరిగిన అంచనా వ్యయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి, ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాం. అవసరమైనన్ని నిధుల విడుదలకు కృషి చేస్తున్నాం.



వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు

మేడారంలో భక్తుల సందడి

తాడ్వాయి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం వనదేవతల చెంత భక్తుల సందడి బుధవారం అధికంగా నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు తల్లులకు పూలు, పండ్లు, పసుపు, కుంకుమ, ఎత్తు బంగారం(బెల్లం) సమర్పించి దేవతలకు పూజలు చేశారు. కోరికలు తీరాలని అమ్మవార్లను వేడుకున్నారు. సుమారు 5వేల మంది భక్తులు సమ్మక్క సారలమ్మ దేవతల గద్దెలను దర్శించుకున్నారని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు.

రామప్పను సందర్శించిన విదేశీయులు



దేవాలయం ఆవరణలో ఫ్రాన్స్, పోలాండ్ దేశస్థులు

వెంకటాపూర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని రామప్ప దేవాలయాన్ని బుధవారం ఫ్రాన్స్‌కు చెందిన టీనా, పోలాండ్ దేశానికి చెందిన టూరిస్టులు సందర్శించారు. ఈ సందర్భంగా వారు రామలింగేశ్వర స్వామిని దర్శించుకోగా అర్చకులు ఉమాశంకర్, హరీశ్‌శర్మ పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం వారు ఆలయ శిల్పకళా సంపదను తనివితీరా తిలకించి అబ్బురపడ్డారు. ఆలయ చరిత్ర, విశిష్టత గురించి గైడ్లను అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచి సరస్సు వద్దకు చేరుకుని ప్రకృతి అందాలను ఆస్వాదించారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి



సాయిలు (ఫైల్)

మరిపెడ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : వడదెబ్బతో మంగళవారం అస్వస్థతకు గురైన మరిపెడ వాసి కంచనపల్లి సాయిలు చికిత్స పొందుతూ అదే రాత్రి మృతి చెందారు. మృతుడికి దత్తత పుత్రిక ఉన్నారు. బుధవారం మృతుడి కుటుంబ సభ్యులను మాజీ వార్డు కౌన్సిలర్ ఎడెల్లి పరుశరాములు, దళిత నాయకులు సైదులు, రవి పరామర్శించారు.

సాగు జలాల కోసం కొట్లాట

- ముగ్గురు రైతులకు గాయాలు



గాయపడిన మంగ్యా

తొర్రూరురూరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం జీకే తండాలో ఎస్సారెస్పీ జలాల కోసం గిరిజన రైతులు కొట్లాడుకొని గాయపడిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. బాధిత రైతుల కథనం ప్రకారం.. రాయపర్తి మండలం మైలారం రిజర్వాయర్ నుంచి ఎస్సారెస్పీ కాలువ డీబీఎం-57 నుంచి జగన్నాథపల్లి, ఊకల్, తొర్రూరు మండలంలోని జీకే తండా, అమ్మాపురం, గుర్తూర్, ఖానాపురం గ్రామాల చెరువులోకి మంగళవారం నీళ్లు వస్తున్నాయి. ఈ క్రమంలో అమ్మాపురం శివారు జీకే తండా గ్రామ చెరువులోకి నీరు సరిగ్గా రాకపోవడంతో తండాకు చెందిన రైతులు బానోత్ మంగ్యా, అజ్మీర రమేష్, గుగులోతు భిక్షం కాలువ వెంట చూసుకుకుంటూ వెళ్లారు. దీంతో తండాకు ఎస్సారెస్పీ జలాలు వచ్చే కాలువ వద్ద రాయపర్తి మండలం బాలాజీ తండాకు చెందిన పలువురు రైతులు గేటు మూసివేయడంతో నిలదీశారు. దీంతో బాలాజీతండాకు చెందిన పలువురు రైతులు జీకే తండాకు చెందిన బానోత్ మంగ్యా, అజ్మీర రమేష్, గుగులోత్ భిక్షంలపై దాడి చేయడంతో గాయపడ్డారు. దీంతో వారు తొర్రూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై ఎస్సై జి.ఉపేందర్‌ను వివరణ కోరగా ఎస్సారెస్పీ కాలువ వద్ద రైతులు కొట్టుకున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, పూర్తి విచారణ చేపట్టి కేసు నమోదు చేస్తామన్నారు.

మానుకోట మార్కెట్‌లో మిర్చి రైతుల ఇక్కట్లు

- రోడ్డుపైనే గంటల తరబడి పడిగాపులు

మహబూబాబాద్ అగ్రికల్చర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌కు మిర్చి అమ్ముకోవడానికి రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయ మార్కెట్ గేట్‌కు తాళంవేసి యార్డులోకి అనుమతించకపోవడంతో గేటుముందు గంటల తరబడి పడిగాపులు కాస్తున్నారు. ఉదయం 7 గంటల నుంచి రాత్రి 10 వరకు మార్కెట్ యార్డులోకి అనుమతించేది లేదని, ఆ తర్వాతనే లోనికి రావాలని మార్కెట్ అధికారులు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో వివిధ గ్రామాల నుంచి మిర్చి అమ్ముకోవడానికి వస్తున్న రైతులు కష్టాలు పడుతున్నారు. బుధవారం మెయిన్‌గేట్, ఇతర గేట్‌లకు తాళాలు వేసి ఉన్న కారణంగా ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మిర్చి లోడ్‌తో వచ్చిన వాహనాలతో పాటు మార్కెట్ తూర్పుగేటు వైపు కూడా భారీగా నిలిచిపోయాయి. మంగళవారం రాత్రి మెయిన్ గేట్ ముందు ట్రాక్టర్లు భారీగా నిలిచిపోయి ఉండడం, ట్రాఫిక్‌కు అంతరాయం కలుగడంతో మార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్‌తో పాటు మార్కెట్ సిబ్బంది వెళ్లి ట్రాఫిక్‌ను క్లియర్ చేసి మిర్చి లోడ్‌తో ఉన్న వాహనాలను మార్కెట్‌లోకి పంపించారు. దాంతో ఇబ్బందులు తొలగిపోయాయి.

బుధవారం మళ్లీ ఈ ఇబ్బందులు యథావిధిగా కొనసాగాయి. యార్డులో కాంటాలు అయిన తర్వాత బస్తాలను లారీలలో వ్యాపారుల గోదాముకు తరలిన తర్వాతనే కొన్ని ట్రాక్టర్ల మిర్చి బస్తాలను లోపలికి పలుమార్లు అనుమతించాల్సిన పరిస్థితి వచ్చింది. మధ్యాహ్నం వరకు 7,285 బస్తాలకు ఈ-నామ్‌లో టెండర్ల ద్వారా వ్యాపారులు ఖరీదులు చేయగా యార్డులో ఇంకా వేలం పాటలు కాకుండా 6 వేల బస్తాల వరకు మిగిలిపోయి ఉన్నాయి. మిగిలిన బస్తాలకు గురువారం వేలం పాటలు జరుగుతాయి. మిర్చి క్వింటాలు గరిష్ఠంగా రూ.14,100 ధర పలుకగా, కనిష్ఠ ధర రూ.10,210 పలికింది.



మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ తూర్పుగేటు ఎదుట బారులు తీరిన మిర్చి లోడ్‌తో వచ్చిన వాహనాలు

అభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర ప్రశంసనీయం

- మహబూబాబాద్ కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్ టౌన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లా అభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర మరువలేనిదని, ఉద్యోగులంతా కలిసి కట్టుగా ఉంటూ అభివృద్ధిలో మరింత ముందుకు తీసుకుపోవాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బుధవారం తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ (టీఎన్జీవోస్) యూనియన్ 2025-టేబుల్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకుపోవడంలో ఉద్యోగులు ముందున్నారని చెప్పారు. ఉద్యోగులకు ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. తొలుత ఉద్యోగులంతా కలిసి జిల్లా కలెక్టర్‌కు మొక్కను అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సల్ టొప్పో, కె.వీరబ్రహ్మచారి, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు వడ్డెబోయిన శ్రీనివాస్, రాష్ట్ర ఈసీ మెంబర్ పమ్మి నాగబ్రహ్మచారి,సునిల్, మైస రోహిత్‌కుమార్, రంజిత్, సురేష్, రమ్య, సుభద్ర, యాకూబ్, టీజీవో జిల్లా అధ్యక్షుడు మహ్మద్ రఫీ, ప్రధాన కార్యదర్శి కుప్ప ప్రసాద్, రాజశేఖర్, సునిల్, రాము, అన్ని శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.



మహబూబాబాద్‌లో టీఎన్జీవోస్ టేబుల్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

అంతర్జాతీయ మహిళా దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ..

మహబూబాబాద్‌లో టీజీవో మహిళా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించే అంతర్జాతీయ మహిళా దినోత్సవం పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఆవిష్కరించారు. ఈ నెల 6,7 తేదీల్లో నిర్వహించే క్రీడా పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనపర్చిన మహిళా ఉద్యోగులకు ఈ నెల 8న ప్రపంచమహిళా దినోత్సవం రోజున బహుమతులు అందించనున్నట్లు టీజీవో జిల్లా అధ్యక్షుడు మహ్మద్ రఫీ తెలిపారు. ఈ కార్యక్రమంలో టీజీవో ప్రతినిధులు కొప్పు ప్రసాద్, రాజశేఖర్, కృష్ణవేణి, నీలోఫర్, ధనమ్మ, ప్రియదర్శిని పాల్గొన్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2311	2100
పల్లికాయ (సూక)	6850	6500
పల్లికాయ (పచ్చిది)	5200	5000
కందులు	6990	5540
పెసళ్లు	6840	4645
పత్తి	6900	5800
పసుపు (కాడి)	-	-
పసుపు (గోల)	-	-
తేజ మిర్చి	14000	9000
డిడి	13000	12500
వండర్‌హాట్	16700	11500
ఎల్లో మిర్చి	17000	15000
యూఎస్341	14600	9500
దేశీ	28500	25500
సింగిల్‌పట్టి	41000	40000
దీపిక	17100	15245
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం

డ్రైపోర్టుకు మోక్షమెప్పుడో?

- డోర్నకల్‌లో అనువుగా స్థలాలు
- జిల్లాపై పాలకుల వివక్షతో నిరుద్యోగుల గుస్సా
- మంజూరుకు కృషి చేస్తానంటున్న విప్ రాంచందర్‌నాయక్

మహబూబాబాద్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : మామునూరుకు విమానాశ్రయం, కాజీపేట్‌లో కోచ్ ఫ్యాక్టరీ తయారీ కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడాన్ని ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలు స్వాగతిస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి స్వతంత్ర జిల్లాగా ఆవిర్భవించిన గిరిజన ప్రాబల్య మానుకోట ప్రాంతంలో ఉపాధి అవకాశాలు లేక ఉద్యోగాలకు ఇతర ప్రాంతాలకు వలస వెళ్తున్న నిరుద్యోగులు సొంత జిల్లాలో అపార ప్రభుత్వ స్థలాలను పాలకులు విస్మరిస్తున్నారని మండిపడుతున్నారు. తొలుత దశాబ్దాల తెలంగాణ ఆశల కాజీపేట్ రైల్ కోచ్ ఫ్యాక్టరీ చివరకు కేంద్రం చలువతో రూ.530 కోట్ల వ్యయంతో నిర్మాణానికి సిద్ధమవుతోంది. తాజాగా, ఏనాటి నుంచో రేపు.. మాపు అంటూ ఊరిస్తూ వచ్చిన మామునూరు ఎయిర్‌పోర్టుకు రాష్ట్ర చొరవ, కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వనే ఇచ్చేసింది. ఇక.. మానుకోట జిల్లా ఏ పాపం చేసిందని ఉపాధి అవకాశాల కల్పన విషయంలో పాలకులు వివక్ష ఎందుకు చూపుతున్నారని యువత ప్రశ్నిస్తోంది.



డోర్నకల్ రైల్వే జంక్షన్

దావోస్‌లో సీఎం ప్రకటనతో ఆశలు

తెలంగాణలో డ్రైపోర్టు నిర్మించి వేర్‌హౌజ్ హబ్‌గా తీర్చిదిద్దుతామని, రాష్ట్రానికి తీరప్రాంతం లేని లోటును పూడ్చడానికి తెలంగాణ డ్రైపోర్టును మచిలిపట్నం పోర్టుకు రోడ్డు, రైల్వే మార్గాలతో అనుసంధానం చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఈ ఏడాది జనవరి చివర్లో దావోస్ సదస్సులో చేసిన ప్ర కటన మరోమారు మహబూబాబాద్ జిల్లాలో అభివృద్ధిపై ఆశలు చిగురింపజేసింది. డ్రైపోర్టు ఏర్పాటుకు భౌగోళికంగా అనువైన ప్రాంతం మానుకోటేనని మేధావి వర్గం స్పష్టం చేస్తోంది. దావోస్‌లో సీఎం ప్రకటనతో తొలుత స్పందించిన ఈ జిల్లాకు చెందిన డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రాంచందర్‌నాయక్ తెలంగాణకు రానున్న డ్రైపోర్టును డోర్నకల్‌కు తీసుకువచ్చేందుకు తనవంతు కృషి చేస్తానని 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు.

అనువైన ప్రాంతంగా మానుకోట

తీరప్రాంత తమిళనాడు ఆంధ్రప్రదేశ్‌లను కలిపే హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై ఉన్న మహబూబాబాద్ జిల్లా మరోపక్క ఉత్తర-దక్షిణ భారతాన్ని అనుసంధానించే గ్రాండ్‌ట్రంక్ రైలు మార్గాల నడుమ కూడా ఉండడంతో ప్రభుత్వ స్థలాలు ఉన్న డోర్నకల్ ప్రాంతం డ్రైపోర్టు ఏర్పాటుకు అనువుగా ఉంటుందని విశ్లేషకుల అభిప్రాయం. స్వరాష్ట్ర ఆవిర్భావంలో డ్రైపోర్టు ఏర్పాటుకు తెలంగాణ ప్రభుత్వం ప్రయత్నాలు చేసింది. 2015 సంవత్సరంలో ఉమ్మడి నల్గొండ జిల్లా కోదాడలో డ్రైపోర్టు ఏర్పాటు చేస్తామని అప్పటి రాష్ట్ర మంత్రి హరీష్‌రావు సూచనప్రాయంగా ప్రకటించారు. అయితే డ్రైపోర్టు ఏర్పాటుకు కావాల్సిన


డోర్నకల్‌లో డ్రైపోర్టుకు అనుకూలంగా ఉన్న భూములు (ఫైల్)

భూముల రేట్లు కోదాడ ప్రాంతంలో ఆకాశాన్ని అంటుతుండడంతో ఆ ప్రయత్నాలు అప్పట్లోనే నిలిచిపోయాయి. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వ సీఎం రేవంత్‌రెడ్డి దావోస్‌లో ప్రకటనతో మహబూబాబాద్ జిల్లాలో ఆ డ్రైపోర్టు ఏర్పాటు చేయాలని నిరుద్యోగులు కోరుతున్నారు.

భౌగోళికంగా రేవు పట్టణాలకు చేరువలో..

కోస్తా ప్రాంతాల్లోని ప్రధాన రేవు పట్టణాలైన విశాఖపట్టణం, గంగవరం, కాకినాడ, మచిలీపట్నం, కృష్ణపట్నం తదితర కేంద్రాలకు తెలంగాణలోని మిగతా ప్రాంతాలకంటే భౌగోళికంగా డోర్నకలే అతి సమీపంలో ఉండడం విశేషం. రోడ్డు రవాణా కోణంలో చూస్తే 365/ఏ జాతీయ రహదారి డోర్నకల్ మండలం మీదుగానే వెళ్తుంది. అమరావతి-నాగ్‌పూర్ మధ్య నూతనంగా నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే కూడా డోర్నకల్ మండలం మీదు గా వెళ్తుంది. ప్రస్తుతం మహబూబాబాద్-డోర్నకల్ మధ్య 33 అడుగుల వెడల్పుతో రోడ్డు మార్గం ఉంది. డోర్నకల్ నుంచి రోడ్డు మార్గంలో ఏన్కూరు, తల్లాడ, సత్తుపల్లి మీదుగా పశ్చిమగోదావరి జిల్లా దేవరపల్లి మీదుగా ప్రయాణిస్తే కాకినాడ వస్తుంది. మరో పక్క డోర్నకల్, ఎన్కూరు, తల్లాడ, కల్లూరు, తిరువురు, నూజివీడు, హనుమాన్ జంక్షన్ నుంచి నూతనంగా నిర్మిస్తున్న మచిలీపట్నం పోర్టు వస్తుంది. చెన్నై, కోల్‌కత్తా జాతీయ రహదారి ద్వారా విశాఖపట్టణం, గంగవరం, కృష్ణపట్నం రేవులకు తెలంగాణ నుంచి ఎగుమతులు చేసే అవకాశాలు ఉంటాయి.

వివిధ దేశాలకు ఎగుమతులు ఇలా..

తెలంగాణ నుంచి ఇప్పటికే గ్రానైట్, పాలిషింగ్ గ్రానైట్, చైనా, జపాన్ దేశాలకు ఎగుమతవుతోంది. ఇంకా బియ్యం, మొక్కజొన్న, మిర్చి, పసుపు, పత్తి తదితర వ్యవసాయ ఉత్పత్తులు, ఫిలిప్పైన్స్, ఇండోనేషియా, థాయిలాండ్, వియాత్నం, మలేషియా, సింగపూర్, ఆస్ట్రేలియా, తూర్పు ఆఫ్రికా దేశాలకు ఎగుమతి జరుగుతున్నాయి. హైదరాబాద్‌లో తయారయ్యే భారీ యంత్ర పరికరాలు కూడా ఎగుమతులు చేసే అవకాశాలు లభిస్తాయి. డ్రైపోర్టుల ద్వారా నిత్యం వివిధ సరుకుల ఎగుమతులు, దిగుమతులు కొనసాగించే కేంద్రానికి అనుసంధానంగా రవాణా కార్యాలయాలు, షిప్పుల వారీగా 24 గంటలు పనిచేసే ఉద్యోగులు, కార్మికులు, వారి కుటుంబాలు ఇలా అన్ని రంగాలకు సంబంధించి మహబూబాబాద్ జిల్లాలో ఉపాధి పొందడానికి అవకాశాలు కలుగుతాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా 5 వేల మందికి పైగా ఉపాధి లభిస్తుంది.

డ్రైపోర్టు ఏర్పాటుకు కృషి


జాటోత్ రాంచందర్‌నాయక్
ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే

డోర్నకల్‌లో డ్రైపోర్టు ఏర్పాటుకు కృషి చేస్తున్నాను. డ్రైపోర్టు ఏర్పాటుకు ఉన్న అవకాశాలన్నీ సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లాను. డోర్నకల్‌లో రైల్వే భూములతో పాటు ప్రైవేట్ భూములు, ప్రభుత్వం సేకరించే భూములూ అందుబాటు ధరల్లో ఉన్నాయి. అవసరమైతే ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల ప్రజాప్రతినిధుల మద్దతు తీసుకుంటాను. డోర్నకల్‌కు రైల్వే, జాతీయ రహదారులు కలిగి ఉన్నాయి. దీంతో ఆ ప్రాంతం డ్రైపోర్టు ఏర్పాటుకు అనువైన ప్రాంతం. శక్తి మేరకు డోర్నకల్‌లో డ్రైపోర్టు ఏర్పాటుకు కృషి చేస్తా.

డ్రైపోర్టు అంటే..

సముద్ర మార్గం ద్వారా జరిగే ఎగుమతి, దిగుమతులకు సంబంధించిన వస్తువులు ఓడరేవుకు చేరుకుని అక్కడ్నుంచి రోడ్డు, రైలు మార్గాల ద్వారా నిర్దేశిత నగరాలు, ప్రదేశాలకు తరలిస్తారు. వాటికి సంబంధించిన ఎగుమతి, దిగుమతి సుంకాలను కేంద్ర ప్రభుత్వం పరిధిలో ఉండే సెంట్రల్ ఎక్సైజ్ అండ్ కస్టమ్స్ డిపార్ట్‌మెంట్ చూస్తుంది. అలాంటి ప్రక్రియ డ్రైపోర్టులోనూ ఉంటుంది. అయితే డ్రైపోర్టును మాత్రం భూభాగం పైనే ఏర్పాటు చేస్తారు. విదేశాలకు ఎగుమతులు, దిగుమతులు ద్వారా వచ్చిన సరుకులను అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన గోదాంలలో నిల్వ చేస్తారు. ఆ సరుకులు కస్టమ్స్ తనిఖీల అనంతరం రవాణాకు అనుమతులు తీసుకునే అవకాశాలుంటాయి. సీఎం రేవంత్‌రెడ్డి దావోస్‌లో చేసిన ప్రకటనకనుగుణంగా తెలంగాణలో డ్రైపోర్టు ఏర్పాటు చేయాల్సి వస్తే ఈ రాష్ట్ర జిల్లాల సరిహద్దు ఉత్తర, దక్షిణ రైలు మార్గాల నడుమ ఉన్న డోర్నకల్ రైల్వేస్టేషనే కీలకం గా మారుతుందని చెబుతున్నారు. డోర్నకల్‌లో రైల్వేకు సం బంధించిన విశాలమైన భూములు ఉండడం, ఒకవేళ ఇవి కూడా సరిపోకపోతే ప్రభుత్వం సేకరించేందుకు అనువుగా డోర్నకల్ చుట్టూరా భూములు తక్కువ ధరలకు ఉండడం లాంటివి పరిగణనలోకి తీసుకుంటే డ్రైపోర్టుకు డోర్నకల్ అనువైన స్థలంగా విశ్లేషిస్తున్నారు.


ధర్మకంచ జడ్పీ పాఠశాలలో విద్యార్థులకు లేఖలు అందిస్తున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

విద్యార్థులకు జయోస్తు లేఖలు

జనగామ కలెక్టర్ వినూత్న కార్యక్రమం

పదో తరగతిలో ఉత్తమ ఫలితాలకు సూచనలు



జనగామ కల్చరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ప్రతీ విద్యార్థి పదో తరగతిలో అత్యుత్తమ ప్రతిభా చాటేలా పాఠశాల విద్యాశాఖ అనేక కార్యక్రమాలు చేపడుతోంది. ప్రేరణ అనే పేరుతో ఇప్పటికే ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. అభ్యాస దీపికలను అందజేసి వాటిలోని ప్రశ్నలకు సమాధానాలను ప్రాక్టీసు చేయడం ద్వారా మంచి మార్కులు రాబట్టేందుకు కృషి చేస్తోంది. విజయోస్తు స్మార్ట్ లర్నింగ్ మెటీరియల్‌ను అందించి వాటిని సాధన చేయిస్తోంది. ఈ క్రమంలో టెన్త్ క్లాసులో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో 'విజయోస్తు-లేఖ' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు జనగామ కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా. పంచసూత్రాలతో విజయోస్తు లేఖను ఆయనే స్వయంగా రాసి విద్యార్థులకు అందజేస్తున్నారు. ఉత్తమ ఫలితాలు సాధించాలంటే క్రమశిక్షణ ఎంతో అవసరమని, సమయపాలన పాటిస్తూ ఒత్తిడికి గురి కాకుండా ప్రణాళికాబద్ధంగా చదవాలని, కష్టపడి చదివిన వారికి ఓటమి అనేది ఉండదని ఆయన సూచిస్తున్నారు. అదే సమయంలో ఆరోగ్యంపై కూడా శ్రద్ధ తీసుకోవాలని, తల్లిదండ్రులు, గురువులు, పెద్దల పట్ల వినయ విధేయతలు ఎంతో అవసరమని విజయోస్తు లేఖల ద్వారా వివరిస్తూకలెక్టర్ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

నేటి నుంచి బుగులు వేంకన్న బ్రహ్మోత్సవాలు

12న స్వామివారి కల్యాణ మహోత్సవం



చిలుపూర్ గుట్ట, బుగులు వేంకన్న ఆలయం

చిలుపూర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : రెండో తిరుపతిగా ప్రసిద్ధి గాంచిన శ్రీ బుగులు వేంకటేశ్వరస్వామి ఆలయం గురువారం నుంచి ప్రారంభమయ్యే బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. అధికారులు భక్తుల కోసం సకల సౌకర్యాలు కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జనగామ జిల్లా చిలుపూర్ మండల కేంద్రంలోని చిలుపూర్ గుట్టపై 14 వందల సంవత్సరాల క్రితం కాకతీయుల కాలంలో నిర్మించిన దేవాలయాల్లో ఒకటైన బుగులు వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఈవో లక్ష్మీప్రసన్న, దేవస్థానం ట్రస్టుబోర్డు చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు సహకారంతో అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రచార రథాన్ని సైతం ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కల్యాణం రోజున భక్తులకు అన్నప్రసాదం అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అన్ని రూట్ల నుంచి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించేవిధంగా ఆర్టీసీ అధికారులతో మాట్లాడారు. తిరుక్కల్యాణ నిర్వహణకు స్థానిక పూజారులు బ్రాహ్మణపల్లి రవీందర్ శర్మ, సౌమిత్రి రంగాచార్యులు, కృష్ణమాచార్యులతో పాటు, హైదరాబాద్‌కు చెందిన వేదపండితుడు అరుణ్‌కుమారా చార్యుల ప్రత్యేక బృందం హాజరుకానుంది. ఇక 12వ తేదీన నిర్వహించే వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవానికి పటిష్ఠ ఏర్పాట్లు చేస్తున్నామని దేవస్థానం ట్రస్టుబోర్డు చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు తెలిపారు. ఈ వేడుకలకు మాజీ డిప్యూటీ సీఎం, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్యతో పాటు, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, అదనపు కలెక్టర్లు రోహిత్‌సింగ్, పింకేశ్‌కుమార్, డీపీవో స్వరూపరాణి, ఆర్డీవో ధరంసోత్ వెంకన్న తదితరులను ఆహ్వానించామని, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు.


ఆలయంలోని స్వామి మూలవిరాట్ →

వారెవ్వా.. హలీమ్

- రంజాన్ మాసంలో ఇదే ప్రత్యేకం
- త్రినగరిలో 200కు పైగా విక్రయ కేంద్రాలు
- బర్డ్‌ఫ్లూ కారణంగా మందకొడిగా చికెన్ హలీమ్ అమ్మకాలు



వడ్డెపల్లి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : పవిత్ర రంజాన్ మాసంలో హలీమ్, హరీస్‌లకు ఎంతో ప్రాముఖ్యత ఉంటుంది. ఉపవాస దీక్షలతో శుష్కించిన శరీరానికి బలవర్ధకమైన అల్పాహారంగా వీటిని ముస్లింలు తీసుకుంటారు. ఇఫ్తార్ సమయంలో ఉపవాసం పూర్తయ్యాక ముస్లింలు హలీమ్, హరీస్ తింటారు. వరంగల్ నగరంలోని మండిబజార్, హనుమకొండలోని న్యూ రాయపుర, అశోక హోటల్ ప్రాంతం సుబేదారి , కలెక్టరేట్‌తోపాటు కాజీపేట రైల్వే జంక్షన్ ఏరియాల్లో ప్రతీ రోజు సాయంత్రం విక్రయాలు జరుగుతున్నాయి. గొర్రె, మేక, కోడి మాంసంతో తయారు చేసే ఈ హలీమ్, హరీస్‌ను ముస్లింలే కాదు ఇతర మతాల వారు కూడా ఎంతో ఇష్టంగా తింటారు. ఇటుకలతో నిర్మించిన బట్టీలపై కట్టెలతో మంట పెడుతూ వండే ఈ పదర్థాల్లో కాజు, బాదం, కిస్మిస్, పిస్తా, మునక్కా, అంజీర్ లాంటి బలవర్ధకమైన దినుసులు కలిపి చాలా సేపు ఉడికిస్తారు. ఆ తర్వాత నానబెట్టిన గోధుమ రవ్వ, స్వచ్ఛమైన నేతిలో పాలు, పెరుగుపోసి మరో రెండుగంటల పాటు ఉడికించి తెడ్లతో బాగా కలియబెడతారు. మెత్తగా ఉడికిన తర్వాత సాయంత్రం వేడిగా ఉన్న హలీమ్, హరీస్‌లను విక్రయిస్తారు. అయితే ఈ ఏడాది బర్డ్‌ఫ్లూ భయం కారణంగా చికెన్ హలీమ్, హరీస్ విక్రయాలు తగ్గాయని వ్యాపారులు అంటున్నారు. హలీమ్ ప్లేట్ ధర రూ. 220, ఫ్యామిలీ ప్యాక్ రూ. 420 పలుకుతోంది. హరీస్ ప్లేట్ ధర రూ. 120, ఫ్యామిలీ ప్యాక్ రూ.300కు విక్రయిస్తున్నారు. అదే విధంగా క్రీమ్ మిల్క్, కోవా, సోరకాయ, డ్రైఫ్రూట్స్‌తో తయారు చేసిన ఖద్దుఖా ఖీర్ ప్లేట్ ధర రూ. 70, డబుల్‌కా మీఠా ప్లేట్ ధర రూ. 60, ఖుబానీ ప్లేట్ ధర రూ.70కు అమ్ముతున్నారు.

దిల్‌షాద్ హోటల్‌లో తొలిసారి..

హలీమ్ వంటకానికి శతాబ్దాల చరిత్ర ఉంది. సౌదీ అరేబియా వంటి గల్ఫ్‌దేశాల్లో ప్రథమంగా ప్రారంభమైన హలీమ్ కాలక్రమేపీ విశ్వవ్యాప్తిలోకి వచ్చింది. తొలుత హైదరాబాద్‌లోని చార్మినార్, గోల్కొండ ప్రాంతాల్లో అమ్మకాలు జరగ్గా.. ఇప్పుడు రంజాన్ మాసంలో అన్ని చోట్ల లభ్యమవుతుంది. వరంగల్‌లో అయితే ప్రప్రథమంగా నగరంలోని మండిబజార్ (దిల్‌షాద్ హోటల్)లో హలీమ్, హరీస్‌ను నగర వాసులకు పరిచయం చేశారు. ఒకప్పుడు హనుమకొండ, సుబేదారి, కాజీపేట, రాయపుర, మచిలీబజార్, ఇట్లీబేస్, ఇమ్లిపుర , అలీపుర , నయీంనగర్‌లోని మండిబజార్‌కు వచ్చి హలీమ్, హరీస్‌లను తినేవారు. ఆ తర్వాత హనుమకొండలోని అప్పటి కోహినూర్ హోటల్, సుబేదారిలోని మునవర్ హోటల్ హలీమ్, హరీస్ వంటకాలు అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం త్రినగరిలో సుమారు 200 లకుపైగా విక్రయ కేంద్రాలు వెలిశాయి.



మందకొడిగా అమ్మకాలు..

ఎండీ అలీఖాన్, సుబేదారి బడే మసీద్

కోళ్లకు బర్డ్ ఫ్లూ సోకిన ప్రభావంతో చికెన్ హలీమ్, హరీస్ విక్రయాలు మందకొడిగా సాగుతున్నాయి. రంజాన్ మాసంలో ముస్లింలు ఎక్కువగా హలీమ్, హరీస్ తినడానికి ఇష్టపడుతారు. ఇతర మతాల వారు కూడా తినేందుకు ఆసక్తి చూపుతారు. కానీ ఈ సారి బర్డ్‌ఫ్లూ భయం కారణంగా తినేందుకు భయపడుతున్నారు.




నగరంలో ఏర్పాటైన హలీమ్ విక్రయశాలలు

ముగ్గురూ.. మనోళ్లేనా?

(5వ పేజీ తరువాయి)

నేపథ్యంలో ఎంపీ టికెట్ ఇచ్చేందుకు కాంగ్రెస్ అంగీకరించలేదు. ఎమ్మెల్సీ సీటు ఇచ్చేందుకు సై అన్నది. అప్పుడు వరంగల్‌లో సీపీఐ బలంగా ఉందనే ఎంపీ టికెట్‌ను పార్టీ అడిగిందనే చర్చ ఉంది. ఖమ్మం నుంచి ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఉన్నారు. ఉమ్మడి కరీంనగర్, మెదక్ జిల్లాలకు సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి లాంటి బలమైన నేతలు ఉన్నారు. అయితే వరంగల్ నుంచి చట్టసభల్లో రెండు దశాబ్దాలుగా ప్రాతినిధ్యం లేకుండా పోతుందని క్యాడర్ ఆందోళనలో ఉంది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ సీటు వరంగల్ నేతలకు ఇవ్వాలని పార్టీ కార్యకర్తలు అధిష్ఠానంపై ఒత్తిడి తెస్తున్నారు. దీంతో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి టి.శ్రీనివాస్‌రావు పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. పార్టీ కోసం సేవలు అందిస్తున్న శ్రీనివాస్‌రావుకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని పార్టీ నేతలపై ఒత్తిడి పెరుగుతోంది. దీంతో సీపీఐకి వచ్చే ఒక సీటు కూడా ఓరుగల్లుకే దక్కుతుందా అనే ఉత్కంఠలో కామ్రేడ్లు ఉన్నారు.

వేం వైపే సీఎం మొగ్గు ?

కాంగ్రెస్‌లో ఎమ్మెల్సీ సీటు కోసం అరడజను మందికి పైగా నేతలు సీరియస్‌గా ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం తన సలహాదారుడు, అప్తమిత్రుడు వేం నరేందర్‌రెడ్డి వైపే మొగ్గు చూపుతున్నారనే చర్చ జరుగుతోంది. పదేళ్ల క్రితం వేం నరేందర్‌రెడ్డికి చేజారిన ఎమ్మెల్సీ సీటును ఈసారి పక్కాగా ఇవ్వాలనే ఆలోచనలో సీఎం ఉన్నారనే చర్చ జరుగుతోంది. 2015లో వేం నరేందర్‌రెడ్డిని టీడీపీ నుంచి ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా గెలిపించుకునేందుకు ఇద్దరు ఎమ్మెల్యేల మద్దతు అవసరం పడింది. కాగా, ఆ ఇద్దరు ఎమ్మెల్యేల మద్దతు కూడకట్టే ప్రయత్నంలో అప్పుడు టీడీపీ ఎమ్మెల్యేగా ఉన్న రేవంత్‌రెడ్డి ఓటు-నోటు కేసు అయింది. అప్పుడు పదేళ్ల క్రితం చేజారిన ఎమ్మెల్సీ పదవిని ఈసారి పక్కాగా వేంకు ఇవ్వాలని సీఎం డిసైడ్ అయ్యారనే చర్చ ఓరుగల్లు పాలిటిక్స్‌లో జోరుగా సాగుతుంది. రేవంత్‌రెడ్డితో పాటు టీడీపీ నుంచి వేం నరేందర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో వరంగల్‌లో ఏదైనా స్థానం నుంచి పోటీకి వేం ఆసక్తి చూపించారు. అయితే అప్పట్లో రాజకీయ సమీకరణలు కుదరకపోవటంతో రేవంత్‌రెడ్డి వెంటే ప్రచారంలో నిలిచారు. గత పదేళ్లుగా కష్టనష్టాల్లో తనతో నిలిచిన వేం నరేందర్‌రెడ్డిని ఈసారి ఎమ్మెల్సీతో పాటు సమీకరణలు కుదిరితే మంత్రిగా సీఎం అవకాశమిచ్చే ఛాన్స్ ఉందనే చర్చ రాజకీయాల్లో జోరుగా జరుగుతోంది. ఇక ఇదే సీటుపై ఆశలు పెట్టుకున్న మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు, మంత్రి కొండా సురేఖ హైదరాబాద్‌లోనే మకాం వేసి ఏఐసీసీ, టీపీసీసీ నేతలతో చర్చలు జరుపుతున్నట్లుగా సమాచారం. వీరితో పాటు శనిగరపు ఇందిరా, దొమ్మాటి సాంబయ్య కూడా ఎమ్మెల్సీ సీటు కోసం ప్రయత్నాలు చేస్తున్న జాబితాలో ఉన్నారు.

గులాబీలో డైలమా..

ఎమ్మెల్సీ సీటుపై బీఆర్ఎస్‌లో ఉత్కంఠ నెలకొంది. ఆ పార్టీకి దక్కేది ఒకే ఒక ఎమ్మెల్సీ సీటు. ఈ ఒక్క సీటు కోసం పాతిక మందికి పైగా నేతలు ఆశలు పెట్టుకున్నారు. అయితే ఉమ్మడి వరంగల్‌జిల్లా చెందిన మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతిరాథోడ్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. అయితే ఉమ్మడి జిల్లాల్లో రాజకీయాల్లో క్రియశీలకంగా వ్యవహరిస్తున్న ఎర్రబెల్లికి ఎమ్మెల్సీ సీటు ఇవ్వాలనే ఒత్తిడి గులాబీ బాస్‌పై ఉన్నట్లుగా సమాచారం. అయితే కుల సమీకరణలు, రాజకీయ వ్యూహంలో భాగంగా గులాబీ ఎమ్మెల్సీ సీటు ఓరుగల్లు దక్కుతుందా ? లేదా ? అనేది క్యాడర్‌లో ఉత్కంఠగా మారింది. ఇప్పటికే నామినేషన్ల పర్వం ప్రారంభం కావటంతో ఆశవహులు అన్ని పార్టీల్లో జోరుగా పైరవీలు చేస్తున్నారు. ఈ నెల 10వ తేదీ వరకు నామినేషన్లకు గడువు ఉండటంతో ఏ పార్టీలో ఎవరికి ఎమ్మెల్సీ సీటు వరిస్తుందో.. శాసనమండలిలో ఓరుగల్లుమని పించే నేతలు ఎవరో అనే ఉత్కంఠ రాజకీయ వర్గాల్లో నెలకొంది.

జాకారంలో పోలీసుల తనిఖీలు

ములుగు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ములుగు మండలంలోని జాకారం గ్రామంలో గల కిరాణాషాపులు, పలు ఇళ్లలో బుధవారం రాత్రి పోలీసులు నార్కోటిక్ డాగ్‌తో తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ శంకర్ మాట్లాడుతూ గంజాయి నిల్వలు ఉన్నాయనే సమాచారంతో తనిఖీలు నిర్వహించడం జరిగిందని అన్నారు. నిషేధిత గంజాయిని ఎవరైనా విక్రయించినా, ఉపయోగించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం అబ్బాపూర్ క్రాస్ వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై వెంకటేశ్వర్‌రావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయండి

సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ మహేందర్‌జీ

ములుగు కలెక్టరేట్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పదో తరగతి వార్షిక పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను అదనపు కలెక్టర్ సి.హెచ్.మహేందర్‌జీ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో వార్షిక పరీక్షల నిర్వహణపై విద్య, రెవెన్యూ, పోలీస్, వైద్యం, పోస్టల్ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా అదనపు కలెక్టర్ మహేందర్‌జీ మాట్లాడుతూ మార్చి 21 నుంచి ఏప్రిల్ 4 వరకు జరిగే పదోతరగతి వార్షిక పరీక్షలకు జిల్లాలో 21 సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. మొత్తం 3134 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని అన్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ఒక్కో పరీక్ష కేంద్రానికి ఒకరు చొప్పున సిట్టింగ్‌స్క్వాడ్‌లు, చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్టుమెంటల్ అధికారులను నియమించామన్నారు. అదేవిధంగా రెండు రూట్లలో రూట్ అధికారులను కేటాయించామని, పరీక్షల నిర్వహణలో భాగంగా విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బందికి ముందుగానే శిక్షణ ఇవ్వాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాల్లో ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ ఫోన్లను అనుమతించరాదని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. పరీక్షలు జరిగే సమయంలో పరీక్ష కేంద్రాల సమీపంలో ఉన్న జీరాక్స్ సెంటర్లను మూసివేయాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో పారిశుధ్య నిర్వహణకు అవసరమైన చర్యలు చేపట్టాలని, ముఖ్యంగా నిరంతర విద్యుత్ సరఫరా, తాగునీరు ఉండేవిధంగా చూడాలని, మూత్రశాలలు, మరుగుదొడ్ల వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ప్రశ్నపత్రాలను పోలీస్ బందోబస్తు మధ్య వాహనంలో పరీక్ష కేంద్రాలకు తరలించాలని, ఎక్కడ కూడా ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్, పెన్ను, పెన్సిల్, రబ్బర్, హాల్‌టికెట్లను మాత్రమే పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించాలని, ప్రతి సెంటర్‌కు ఇద్దరు కానిస్టేబుళ్లతో బందోబస్తు నిర్వహించాలన్నారు. ప్రతి పరీక్ష కేంద్రంలో ప్రాథమిక చికిత్స కిట్‌లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండాలని, ఆశా వర్కర్లను నియమించాలన్నారు. పరీక్ష రాసే విద్యార్థుల గదుల్లో ఎలాంటి మెటీరియల్ లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, సీసీ కెమెరాల పర్యవేక్షణలో పేపర్ల తనిఖీ చేయాలన్నారు. పరీక్ష రాసే విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు సకాలంలో చేరుకోవాలన్నారు. ఎక్కడా మాల్ ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వి ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ సదానందం, డీఎంహెచ్‌వో గోపాల్‌రావు, విద్యుత్‌శాఖ డీఈ నాగేశ్వర్‌రావు, ఏఎంవిఐ వినోద్‌రెడ్డి, ఆర్టీసీ కంట్రోలర్ మోహన్, ఎస్టీవో సురేష్, బ్రాంచ్ పోస్టుమాస్టర్ సురేందర్, ప్రభుత్వ పరీక్షల సహాయ నియంత్రణ అధికారి జయదేవ్, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మహేందర్‌జీ

ముఖాముఖి



దోలి శంకర్
ములుగు ఫారెస్టు రేంజ్ అధికారి

వేసవిలో అప్రమత్తంగానే ఉన్నాం..

ఆంధ్రజ్యోతి : అగ్ని ప్రమాదాల నివారణకు చర్యలు ఎలా ఉన్నాయి?

ఎఫ్ఆర్‌వో : వేసవిలో అడవుల్లో అగ్నిప్రమాదాలు సర్వసాధారణం. భారీ ప్రమాదాలుగా రూపాంతరం చెందకుండా అప్రమత్తంగానే ఉన్నాం. నిప్పు కనిపించిన వెంటనే ఆర్పే ప్రయత్నాలను ముమ్మరం చేశాం. ఐదుగురు సభ్యులతో కూడిన క్విక్ రెస్పాన్స్ టీమ్‌ను నియమించాం.

ఆంధ్రజ్యోతి : అటవీ జంతువుల సంరక్షణకు తీసుకుంటున్న చర్యలు?

ఎఫ్ఆర్‌వో : వన్యప్రాణుల సంరక్షణ కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాం. అడవుల్లో జంతువుల సంచారం ఎక్కువగా ఉన్న చోట్ల నీటి తొట్లను నిర్మించాం. నిత్యం నీటిని నింపుతున్నాం. గ్రామ పంచాయతీ ట్యాంకర్లతోపాటు ప్రైవేటు ట్యాంకర్లను ఉపయోగిస్తున్నాం. వాగులలో చెలిమెలు తవ్విస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : కలప, ఇసుక అక్రమ రవాణాపై నిఘా పెట్టారా?

ఎఫ్ఆర్‌వో : అడవుల్లో లభించే సహజ వనరులు దోపిడికి గురికాకుండా కఠినంగా వ్యవహరిస్తున్నాం. ఇప్పటి వరకైతే పరిస్థితి అదుపులో ఉంది. ఇంచర్ల వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు ద్వారా వాహనాలను తనిఖీ చేస్తున్నాం. ఓ వాచర్‌తోపాటు ఇద్దరు సిబ్బందిని అక్కడ నియమించాం. కలప, ఇసుక అక్రమంగా తరలించకుండా నిఘాను పటిష్టం చేశాం.

ఆంధ్రజ్యోతి : నర్సరీల నిర్వహణ ఎలా ఉంది ?

ఎఫ్ఆర్‌వో : ములుగు ఫారెస్టు రేంజ్ పరిధిలో పెద్దఎత్తున మొక్కలు నాటేందుకు కార్యాచరణ రూపొందించాం. పాలంపేట నర్సరీలో లక్ష, జాకారం నర్సరీలో 50వేల చొప్పున మొక్కలను ఉత్పత్తి చేస్తున్నాం. పండ్లు, పూలు, కలప, నీడనిచ్చే పలు జాతుల మొక్కలు సిద్ధమవుతున్నాయి.

\- ములుగు కలెక్టరేట్ (ఆంధ్రజ్యోతి)

జర్నలిస్టులకు ప్రమాద బీమా అవసరం

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : జర్నలిస్టులకు ప్రమాద బీమా ఎంతో అవసరమని కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్ యూనియన్ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు ప్రమాద బీమా పత్రాల పంపిణీ కార్యక్రమం కలెక్టర్ చేతుల మీదుగా బుధవారం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ టీఎస్‌జేయూ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు రూ. 5 లక్షల వ్యక్తిగత బీమా ఇవ్వడం సంతోషకరమన్నారు. ఈకార్యక్రమంలో టీఎస్‌జేయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్, జిల్లా అధ్యక్షుడు సంతోష్, యూనియన్ నాయకులు రవీందర్, గట్టు రవి, పల్నాటి రాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు క్రీడా పోటీలు

భూపాలపల్లి కృష్ణకాలనీ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని మంజూర్‌నగర్‌లో ఉన్న ఇల్లందు క్లబ్‌లో సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో మహిళలకు బుధవారం క్రీడా పోటీలను నిర్వహించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ కార్యక్రమాన్ని చేపట్టగా ముఖ్య అతిథిగా సమితి ఏరియా అధ్యక్షురాలు సునీత హాజరయ్యారు. ఈకార్యక్రమంలో ఇల్లందు క్లబ్ సెక్రటరీ రమణి, ఇతర మహిళా సభ్యులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలపై శిక్షణ

భూపాలపల్లిటౌన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల కోసం ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని డీఈవో ముద్దమల్ల రాజేందర్ నిర్వహించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణ పట్ల చీఫ్ సూపరింటెండెండ్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, సీ సెంటర్ కస్టోడియన్, మండల విద్యాశాఖ అధికారులకు ఈ శిక్షణను అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి హాజరయ్యారు. పరీక్ష నిర్వహణ పూర్తయ్యే వరకు క్రమశిక్షణతో నిబద్ధతగా పనిచేయాలని సూచించారు. పరీక్షలు సాఫీగా జరగడానికి 20 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 20 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులను, ముగ్గురు సీ సెంటర్ అధికారులను, ఇద్దరు రూట్ అధికారులు, రెండు ఫ్లైయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పరీక్షల నిర్వహణపై ఉపాధ్యాయుడు కృష్ణమోహన్ శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో పరీక్షల నియంత్రణ అధికారి మండల రవీందర్‌రెడ్డి, జిల్లా ఉమ్మడి పరీక్షల కార్యదర్శి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

విలాసాగర్ చెరువులో చేపలు చోరీ

కాటారం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని విలాసాగర్ పెద్ద చెరువులో 4 క్వింటాళ్లకు పైగా చేపలు చోరీకి గురయ్యాయని విలాసాగర్ గ్రామ మత్స్యకార సొసైటీ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో గుర్తుతెలియని వ్యక్తులు రాత్రి పూట చోరీ చేస్తుండగా బుధవారం గంగారం గ్రామానికి చెందిన వ్యక్తులు చెరువులో చేపలు పట్టడానికి వచ్చారని ఆరోపించారు. తాము ఎందుకు చేపలు పడుతున్నారని నిలదీస్తే పట్టుకున్న చేపలతో తమను నెట్టేసి వెళ్లిపోయారన్నారు. దొంగతనంగా చేపలు పట్టుకుంటున్న విషయంపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు పెద్దపల్లి శశికాంత్, కిరణ్, బాలాజీ, శ్రీనివాస్, నర్సయ్య, రమేష్, పోచయ్య, రాంచందర్ తెలిపారు. చేపలు చోరీ చేస్తున్న వారిపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

చిట్యాల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన మండలంలోని చైన్‌పాకలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి పెద్ది కిష్టస్వామి (60) మద్యానికి బానిసై తరచుగా కుటుంబ సభ్యులతో గొడవ పడేవాడు. ఈనెల 2న మద్యం సేవించి ఇంటికి చేరుకున్న అతడు భార్య స్వరూపను దుర్భాషలాడటంతో ఘర్షణ చోటుచేసుకుంది. ఈక్రమంలో ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి పడిపోవడంతో గమనించిన కుటుంబ సభ్యులు చిట్యాల సామాజిక ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికిలో చేర్పించారు. చికిత్స అందిస్తున్న క్రమంలో మంగళవారం అర్ధరాత్రి కిష్టస్వామి మృతి చెందాడు. మృతుడి భార్య స్వరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై మధుసూదన్ తెలిపారు.

తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో మంటలు

తాడ్వాయి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో చెట్ల కింద గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు వేశారు. దీంతో ఆకులు, చెత్త అంటుకొని మంటలు చెలరేగాయి. ఈ క్రమంలో సమీపంలోనే పోలీస్‌స్టేషన్ ఉండగా ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి గమనించి అక్కడికి చేరుకొని మంటలను ఆర్పివేశారు.

జిన్నింగ్ మిల్లులో అగ్ని ప్రమాదం

కాటారం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని రేగులగూడెం గ్రామపంచాయతీ పరిధి రుద్ర కాటన్ జిన్నింగ్ మిల్లులో బుధవారం సాయంత్రం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. మిల్లులో సీసీఐకి సంబంధించిన పత్తిని జిన్నింగ్ చేస్తున్న సమయంలో మోటార్ వద్ద విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఏర్పడి నిప్పు రవ్వలు లేచి అగ్నిప్రమాదం సంభవించింది. జిన్నింగ్ యంత్రాలతో పాటు విద్యుత్ కేబుల్స్, పత్తి బేళ్లు, పత్తి వేస్ట్ కాలిపోయాయి 50క్వింటాళ్లకు పైగా పత్తి దగ్ధమైంది. విద్యుత్ తీగలతో మంటలు మిల్లు బయట ఉన్న కాటన్ వేస్ట్ కుప్పలకు వ్యాపించాయి. ప్రమాద సమయంలో మిల్లు వద్ద ఉన్న నిర్వాహకులు, మిల్లు డ్రైవర్లు, కూలీలు హుటాహుటిన మోటార్ల ద్వారా మంటలను ఆర్పడానికి ప్రయత్నించారు. మంథని, భూపాలపల్లి నుంచి ఫైరింజన్లు వచ్చి మంటలను ఆర్పేశాయి. సంఘటనా స్థలాన్ని ఎస్సై అభినవ్ పరిశీలించారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.15లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు అంచనా. మిల్లు నిర్వాహకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు ఎస్సై తెలిపారు. ఈ ఏడాది జనవరిలో మీనాక్షి జిన్నింగ్ మిల్లులోనూ అగ్ని ప్రమాదం చోటుచేసుకుని వందలాది క్వింటాళ్ల పత్తి దగ్ధమైంది.



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

లారీ ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు

భూపాలపల్లి కృష్ణకాలనీ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలైన సంఘటన మంజూర్‌నగర్‌లోని ఏరియా ఆస్పత్రి ఎదుట బుధవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి పట్టణ పరిధిలోని మహబూబ్‌పల్లి గ్రామానికి చెందిన ఒజ్జాల రమణ జెన్‌కోలో ప్రైవేటు సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నాడు. డ్యూటీ నుంచి బైక్‌పై తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో మంజూర్‌నగర్‌లో కాటారం వైపు నుంచి పరకాల వైపు వెళ్లే లారీ ఢీకొంది. దీంతో అతడు కిందపడిపోవయి తలకు తీవ్రగాయమై రక్తస్రావమైంది. అయినప్పటికీ లారీ డ్రైవర్ ఆపకుండా వేగంగా వెళ్లినట్లు స్థానికులు తెలిపారు. గాయపడిన రమణను స్థానికులు వెంటనే వంద పడకల ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్‌కు తీసుకెళ్లినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

సైబర్ నేరాలపై మహిళలు అవగాహన కలిగి ఉండాలి

ములుగు కలెక్టరేట్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల మహిళలు జాగ్రత్తగా ఉండాలని సైబర్ క్రైమ్ డీఎస్పీ సందీప్‌రెడ్డి అన్నారు. ములుగు మండలంలోని జంగాపల్లి గ్రామంలో మహిళా స్వయం సహాయక బృందాల మహిళలకు అవగాహన కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన డిజిటల్ అరెస్ట్, జాబ్‌ఫ్రాడ్, సైబర్ స్టాకింగ్, సైబర్ స్లేవరీ, మల్టీలెవల్ మార్కెటింగ్ ఫ్రాడ్ వంటి సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఎవరైనా సైబర్ నేరాలకు గురైనట్లయితే వెంటనే ట్రోల్‌ఫ్రీ నంబర్ 1930 లేదా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సైబర్‌క్రైమ్.జీవోవీ.ఇన్ పోర్టల్‌లో రిపోర్టు చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో సైబర్‌క్రైమ్ ఇన్‌స్పెక్టర్ యాసీన్, జంగాలపల్లి సీసీ భీమా, ములుగు సీసీ చంద్రమౌళి, పోలీస్ సిబ్బంది శ్రీకాంత్, ఉమామహేశ్వర్, తేజస్వి, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

పశువులను అక్రమంగా తరలిస్తే చర్యలు

వెంకటాపురం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): పశువులను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని స్థానిక సీఐ బండారి కుమార్ హెచ్చరించారు. బుధవారం మండలంలోని చొక్కాల గ్రామ సమీపంలో నాలుగు బొలెరో వాహనాల్లో పశువులను తరలిస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. 42 పశువులు సహా నాలుగు వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. అదుపులోకి తీసుకున్న వ్యక్తులను విచారించగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు తెలిపారని పేర్కొన్నారు. వరంగల్ జిల్లాకు చెందిన మహమ్మద్ షఫీ, ములుగు మండలం జంగాలపల్లికి చెందిన రాజేందర్, సంపత్, సుగాలి రాజేందర్, మహేష్, ఆత్మకూరు మండలం నీరుకుళ్ల గ్రామానికి చెందిన మహమ్మద్ జాఫర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై కొప్పుల తిరుపతిరావు, ఏఎస్సై రామచంద్రు, సిబ్బంది పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

మంగపేట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన సంఘటన మండలంలోని తిమ్మంపేటలో మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. నేతకాని కాలనీకి చెందిన గోమాస్ సమ్మయ్య పూరిల్లు కాలిపోవడంతో సుమారు రూ. 5 లక్షలు నష్టం వాటిల్లినట్టు బాధిత కుటుంబం తెలిపింది. విద్యార్హత సర్టిఫికెట్లు, మూడు తులాల బంగారం, 20 తులాల వెండి, ఫర్నిచర్ కాలిబూడిదైనట్టు పేర్కొంది.

ఆర్టీసీ బస్సుకు తప్పిన ప్రమాదం

వెంకటాపురం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాత్రాపురం గ్రామ సమీపంలో ఆర్టీసీ బస్సుకు త్రుటిలో ప్రమాదం తప్పిన సంఘటన బుధవారం జరిగింది. వివరాల్లోకి వెళితే..భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం నుంచి వెంకటాపురం మండలకేంద్రానికి ప్రయాణికులతో వస్తున్న ఆర్టీసీ బస్సు పాత్రాపురం సమీపంలోకి చేరుకోగా బస్సు వెనక చక్రం టైరుబోల్టులు విరిగిపోయి టైరు ఊడిపోయింది. దీంతో బస్సు రోడ్డుపై నుంచి పక్కకు పోతుండగా డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి బస్సును అదుపులోకి తీసుకొచ్చాడు. దీంతో బస్సులో ప్రయాణిస్తున్న సుమారు 50మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు.

బ్రిలియంట్ గ్రామర్ హైస్కూల్‌లో సైన్స్ సంబరాలు

ములుగు కలెక్టరేట్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ములుగులోని బ్రిలియంట్ గ్రామర్ హైస్కూల్‌లో సైన్స్‌ఫెయిర్ బుధవారం ఘనంగా జరిగింది. ఈసందర్భంగా విద్యార్థులు స్వతహాగా చేసిన ప్రయో గాలు తోటి విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను ఆకట్టుకున్నాయి. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థుల్లో దాగి ఉన్న శాస్త్రీయ నైపుణ్యాన్ని వెలికి తీసేందుకే సైన్స్‌ఫెయిర్ నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయుడు ముద్దం సంతోష్ తెలిపారు.



ఎగ్జిబిట్లను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

మావోయిస్టు కొరియర్ల అరెస్టు

వెంకటాపురం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి క్రాస్ వద్ద నలుగురు మావోయిస్టు కొరియర్లను స్థానిక పోలీసులు అరెస్టు చేశారు. ఈమేరకు బుధవారం ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వ హించి వివరాలు వెల్లడించారు. కొత్తపల్లి క్రాస్ వద్ద పోలీసులు వాహన తనిఖీలు నిర్వహి స్తుండగా ఆటోలో వచ్చిన నలుగురు వ్యక్తులు పోలీసులను చూసి పారిపోతుండగా వారిని వెంబడించి అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారిని విచారించగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా గుజేపర్తి గ్రామానికి చెందిన బాడిస అనిల్, పరువుగూడానికి చెం దిన భరామన్, మడవి సుక్కసోడి, ఇడు మాల్‌గా చెప్పి గత కొంతకాలంగా నిషేధిత మావోయిస్టు పార్టీకి కొరియర్లుగా పనిచేస్తు న్నట్లు ఒప్పుకున్నారని అన్నారు. వారి వద్ద మావోయిస్టుపార్టీకి సంబంధించిన వస్తువులు, బూట్లు, ఎలక్ట్రికల్ సామగ్రి, దుస్తులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నలుగురు వ్యక్తులను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించి నట్లు ఏఎస్పీ వివరించారు.

మంత్రి సీతక్కను కలిసిన జిల్లా రైస్ మిల్లర్లు

ములుగు కలెక్టరేట్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్కను బుధవారం ములుగు జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాదం ప్రవీణ్ ఆధ్వర్యంలో సభ్యులు కలిశారు. ఈసందర్భంగా రైస్‌మిల్లర్లు ఎదుర్కొంటున్న పలు సమస్యలను మంత్రితో చర్చించి వినతిపత్రం అందజేశారు. దీంతో స్పందించిన మంత్రి సీతక్క సివిల్‌సప్లయ్ కార్పొరేషన్ కమిషనర్‌కు ఫోన్ చేసి గతంలో మాదిరిగానే బియ్యం డెలివరీలు చేసేందుకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా కోశాధికారి మోహన్, రైస్‌మిల్లర్లు వాసుదేవరెడ్డి, ఆరె విజేందర్, యంసాని సంతోష్ రవీందర్‌రెడ్డి, భిక్షపతి పాల్గొన్నారు.



మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేస్తున్న రైస్ మిల్లర్లు

కేన్ ప్రాంతాన్ని కన్జర్వేషన్ రిజర్వ్ జోన్‌గా ప్రకటించాలి

వెంకటాపూర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలంపేట గ్రామ శివారులో 51 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న కేన్ మొక్కల ప్రాంతాన్ని కన్జర్వేషన్ రిజర్వ్ జోన్‌గా ప్రకటించాలని వృక్ష శాస్త్రవేత్త, కేన్ మాన్ ఆఫ్ తెలంగాణ డాక్టర్ సుతారి సతీష్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అధికారుల అలసత్వంతో కొన్ని దశాబ్దాలుగా రక్షణకు నోచుకోని ఈప్రాంతంపై ఇప్పటికైనా దృష్టి పెట్టి విలువైన జీవవైవిధ్య ప్రాంతాన్ని భావి తరాలకు అందించాలని పేర్కొన్నారు. ఇందులో భాగంగానే పీసీసీఎఫ్, ములుగు జిల్లా కలెక్టర్, ఫారెస్ట్ ఐజీ, వైల్డ్‌లైఫ్ విభాగం, అటవీ పర్యావరణ శాఖ, అటవీ పరిరక్షణ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, జీవవైవిధ్య మండలి కార్యదర్శి, సీసీఎఫ్, డీఎఫ్‌వోలకు పూర్తి వివరాలతో కూడిన లేఖను అందించినట్లు తెలిపారు. 51 ఎకరాల కేన్ ప్రాంతాన్ని కన్జర్వేషన్ రిజర్వ్‌జోన్‌గా ప్రకటిస్తూ కేనోపివాక్ పేరుతో టూరిజం స్పాట్‌గా అభివృద్ధి చేయాలని అధికారులను కోరినట్లు తెలిపారు.

ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలి

గోవిందరావుపేట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): హెచ్‌ఐవీ ఎయిడ్స్ అంటు వ్యాధి కాదని, అంటించుకునే వ్యాధి అని వైఆర్‌జీ కేర్ లింక్ వర్కర్ టి.కిషన్, ఐసీటీసీ కౌన్సిలర్ వెంకటేశ్వర్లు అన్నారు. ప్రతి ఒక్కరూ హెచ్‌ఐవీ, ఎయిడ్స్ పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరం జరగగా వారు పాల్గొని 57 మందికి హెచ్‌ఐవీ పరీక్షలు బుధవారం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ హెచ్‌ఐవీ నాలుగు మార్గాల ద్వారా వస్తుందని, సురక్షితం కాని లైంగిక సంబంధాలు, కలుషితమైన సూదులు, ఇంజక్షన్లు, పరీక్షించని రక్త మార్పిడి, హెచ్‌ఐవీ గర్భిణీ నుంచి పుట్టబోయే బిడ్డకు వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఆశా వర్కర్లు అనిత, స్వాతి పాల్గొన్నారు.

నూగూరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా రాంబాబు

వాజేడు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): నూగూరు చర్ల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా వాజేడుకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు పూనెం రాంబాబును నియమించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. నూగూరు చర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ భద్రాద్రి కొత్తగుడెం జిల్లా చర్ల మండలానికి చెందిన ఇర్పా శ్రీనును నియమించగా వాజేడుకు చెందిన పూనెం రాంబాబును వైస్ చైర్మన్‌గా ప్రకటించారు. అదే విధంగా వాజేడుకు చెందిన బోదెబోయిన చంద్రయ్య, ఆలం సత్యనారా యణ, పోశెట్టి గౌరయ్యను డైరెక్టర్లుగా నియమించారు. వీరు ఈ పద వులలో రెండేళ్ల పాటు కొనసాగనున్నారు. తనను వైస్ చైర్మన్‌గా నియమించడం పట్ల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, అడవి అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, భద్రాచలం మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్యకు, ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావుకు రాంబాబు కృతజ్ఞతలు తెలిపారు.



కాళేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

మహాదేవపూర్, మార్చి 5(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఐటీ, శాసనసభ వ్యవహా రాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో బుధవారం కాళేశ్వర, ముక్తేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుభానందదేవి ఆలయంలో కుంకుమా ర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాళేశ్వరం మాజీ ఎంపీటీసీ రేవెల్లి మమత నాగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అశోక్, మాడుగుల పవన్‌శర్మ, లక్ష్మణ్, సత్యనారాయణ, మధుసూదన్ పాల్గొన్నారు.



స్వామి వారికి అభిషేకం చేస్తున్న భక్తులు

గుట్ట నుంచి గుడికి వన దేవతలు

మంగపేట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) మండలంలోని కొత్తమల్లూరు గ్రామ పంచాయతీ శివారు మామిడిగూడెంలో వెలిసియున్న వనదేవతలు సమ్మక్క-సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు, పాగులమ్మను మల్లూరు గుట్ట నుంచి గుడికి బుధవారం చేర్చారు. ఆలయ దేవరబాల పూనెం జనార్దన్, వడ్డే లక్ష్మయ్య, తలపతి పూనెం వెంకటేశ్వర్లు, దేవర కర్రెలు ఆడించే పూజారులు వాసం సాంబశివరావు, ఎట్టి సాయి, తాటి చందు, నాగ మల్లేష్ ఆధ్వర్యంలో ఆదివాసీ కుల పెద్దలు గుట్ట నుంచి వన దేవతలను ఊరేగింపుగా తీసుకొచ్చారు.



వన దేవతలను గుడికి చేర్చుతున్న పూజారులు

పెళ్లింట విషాదం

వాజేడు, మార్చి 5(ఆంధ్ర జ్యోతి): పెళ్లి ఇంట విషాదం చోటుచేసుకుంది. పెళ్లి అయిన రెండు రోజులకే వరుడి తండ్రి మృతి చెందిన సంఘటన మండలంలోని సుందరయ్య కాలనీలో చోటుచేసుకుంది. అక్కి శెట్టి ఏసుబాబు(48) పెద్ద కుమారుడు హరి కృష్ణ వివాహం సోమవారం చర్ల మండలంలో జరిపించారు. మంగళవారం ఇంటి వద్ద నూతన దంపతుల చేత సత్యనారాయణ స్వామి వ్రతం జరిపిస్తుండగా ఏసుబాబు ఒక్కసారిగా పక్షవాత లక్షణాలతో కిందపడిపోయాడు. వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ ఏసుబాబు బుధవారం మృతి చెందాడు.

కాటారం రేంజ్ అడవుల్లో డీఎఫ్‌వో పర్యటన

కాటారం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): అటవీ శాఖ కాటారం రేంజ్‌లోని దామెరకుంట సెక్షన్ పరిధిలోని అడవుల్లో డీఎఫ్‌వో నవీన్‌రెడ్డి బుధవారం సాయంత్రం పర్యటించారు. దామెరకుంట, అన్నారం అడవులను పరిశీలించి అడవుల అభివృద్ధి, వన్యప్రాణుల సంరక్షణపై అటవీ అధికారులు, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. పెద్దపులి పాదముద్రలు అన్నారం అడవుల నుంచి గోదా వరి వైపు ఉండటంతో పులి జిల్లా సరిహద్దులను దాటి నట్లు అటవీ అధికారులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆయన వెంట ఎఫ్ఆర్వో స్వాతి, డిప్యూటీ రేంజర్ సురేందర్, ఎఫ్ఎస్‌వో చంద్రశేఖర్, ఎఫ్‌బీవోలు రాజేందర్, రాజ్‌కుమార్, సంజీవ్, అశోక్ ఉన్నారు.